RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY — తెలుగు దినపత్రిక

మల్కాజిగిరి MALKAJGIRI | సంపుటి : 3 VOLUME : 3 | సంచిక : 103 ISSUE NO : 103 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ EDITOR : MERUGU CHANDRAMOHAN | శనివారం,అక్టోబర్,11,2025 Saturday,October,11,2025 | పేజీలు : 8 వెల : రూ.4/- PAGES : 8 RS : 4/-

### హైదరాబాద్ అభివృద్ధికి ప్రభుత్వం

# కట్టుబడి ఉంది..

## - డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**హైదరాబాద్,అక్టోబర్,10,తెలంగాణ దిశ :** నగరసమగ్రాభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. రియల్ ఎస్టేట్ వేగంగా దూసుకెళ్తుందని పేర్కొన్నారు. నరెడ్కో 15వ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాయదుర్గంలో ఎకరం రూ.177 కోట్లు పలికిందని గుర్తు చేశారు. మధ్య, దిగువ మధ్య తరగతి వర్గాలను బిల్డర్లు దృష్టిలో పెట్టుకోవాలని భట్టి సూచించారు. భవిష్యత్తులో నగరంలో అన్ని ఎలక్ట్రిక్ బస్సులే ఉంటాయని చెప్పారు. ప్రతి సంవత్సరం నగర అభివృద్ధికి ప్రణాళిక వ్యయంలో భాగంగా బడ్జెట్లో రూ.10 వేల కోట్లు కేటాయిస్తున్నామని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో రెండు సంవత్సరాల్లో రూ.20వేల కోట్లు కేటాయించి చేపట్టిన పనుల ఫలితాలు ఇప్పుడే కనిపిస్తున్నాయని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

ఈ పనులు నగర రూ పురేఖలను మార్చబోతున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇట్రీట్‌మెంట్ ప్లాంట్ల పనులకు ఆమోదం తెలిపినట్లు చెప్పారు. తాగునీటి అవసరాల కోసం సుమారు రూ.11,927 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు వివరించారు. రూ.13,704 కోట్ల వ్యయంతో మరికొన్ని తాగునీటి, సీవరేజ్ ప్లాంట్ పనులు ప్రతిపాదనలో ఉన్నాయని స్పష్టం చేశారు. మొత్తంగా సీవరేజ్, తాగునీటి సరఫరా కోసం రూ.25,631 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

ప్యారడైజ్ జంక్షన్ నుంచి నేషనల్ హైవేను కలుపుతూ ఎలివేటెడ్ కారిడార్ నిర్మించేందుకు రూ.1,487 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు భట్టి చెప్పుకొచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా ఢిల్లీలో మకాం వేసి కేంద్ర డిఫెన్స్ మంత్రిని ఒప్పించారని గుర్తు చేశారు. శామీర్‌పేటలో రూ.3,619 కోట్లతో రోడ్డు వెడల్పు పనులు చేపడుతున్నామని తెలిపారు.


దేశంలోని ఇతర ఏ నగరాల్లో లేనివిధంగా 24 గంటలు నాణ్యమైన విద్యుత్తు, మంచినీటి సరఫరా హైదరాబాద్ నగరంలో సరఫరా జరుగుతుందని భట్టి తెలిపారు. ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్‌తో ఉచితంగా విద్యను అందిం చేందుకు ఒక్కో పాఠశాలను రూ.25 కోట్లతో 25 ఎకరాల విస్తీర్ణంలో ప్రభుత్వం నిర్మిస్తోందని భట్టి విక్రమార్క తెలిపారు. ఇందుకుగాను రూ.11,500 కోట్ల బడ్జెట్ కేటాయించి పాఠశాలల నిర్మాణానికి టెండర్లు పిలిచినట్లు చెప్పారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఆసుపత్రులను అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. విల్లాలు, హై రైజ్ బిల్డింగులకే బిల్డర్లు పరిమితం కావొద్దని సూచించారు.



## జమ్మూ కశ్మీర్‌కు రాష్ట్ర హోదాపై పిటిషన్లు..

### కేంద్రానికి 'సుప్రీం' కీలక ఆదేశాలు..!

**న్యూఢిల్లీ,అక్టోబర్,10:** జమ్మూ కశ్మీర్ రాష్ట్ర హోదా పునరుద్ధరించాలంటూ దాఖలైన పిటిషన్‌పై కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్ర హోదా అంశంపై దాఖలైన పిటిషన్లపై స్పందన చెప్పాలంటూ కేంద్రానికి నాలుగు వారాల గడువు ఇచ్చింది. సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం పిటిషన్లను విచారించింది. విద్యావేత్త జహూర్ అహ్మద్ భట్, సామాజిక కార్యకర్త అహ్మద్ మాలిక్‌తో పాటు పలువురు పిటిషన్లు దాఖలు చేశారు. 2023 డిసెంబర్‌లో కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు ఇచ్చిన హామీ మేరకు త్వరగా రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని పిటిషనర్లు కోరారు. ఆర్టికల్ 370 రద్దును సమర్థిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పిటిషనర్ల తరఫు న్యాయవాదులు ఈ సందర్భంగా ప్రస్తావించారు.



### బసవతారకం ఆసుపత్రి వద్ద

## హైడ్రా కూల్చివేతలు..

**హైదరాబాద్,అక్టోబర్,10,తెలంగాణ దిశ :** హైదరాబాద్ సిటీలో హైడ్రా కూల్చివేతలు కొనసాగుతున్నాయి. బంజారా హిల్స్‌లో శుక్రవారం ఉదయం నుంచి హైడ్రా కూల్చివేతలు చేపట్టింది. సుమారు 750 కోట్ల విలువైన ప్రభుత్వ స్థలంలో ఆక్రమణలను హైడ్రా అధికారులు తొలగిస్తున్నారు. వివరాల ప్రకారం.. బంజారాహిల్స్‌లోని బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి సమీపంలో ఆక్రమణకు గురైన ఐదు ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని హైడ్రా గుర్తించింది. ఈ నేపథ్యంలో రంగంలోకి దిగిన అధికారులు.. స్థలాన్ని పరిశీలించి ఆక్రమణలను తొలగించాలని నిర్ణయం తీసుకున్నారు. దీంతో, శుక్రవారం ఉదయం హైడ్రా అధికారులు.. అక్కడికి చేరుకుని అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్నారు. భారీ పోలీసు బందోబస్తు నడుమ హైడ్రా సిబ్బంది కూల్చివేతలు చేపట్టారు. కాగా, వీఆర్ ఇన్‌ఫ్రా పార్థసారథి, ఆయన కుమారుడు విజయ్ భార్గవా భూమిని కబ్జా చేసినట్టు తెలిసింది. షేక్‌పేట మండలం బంజారాహిల్స్ రోడ్డు నంబర్-10లో ఆక్రమణలను హైడ్రా అధికారులు తొలగించారు. గతంలో ప్రభుత్వం ఐదు ఎకరాల్లో జలమండలికి 1.20 ఎకరాలను కేటాయించింది.

# రాష్ట్రంలో ఆధ్యాత్మిక పునరుజ్జీవనం లక్ష్యం

## - మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**భద్రాచలం,10,తెలంగాణ దిశ :** దక్షిణ అయోధ్య భద్రాద్రి సీతా రామచంద్ర స్వామి ఆలయ నిర్మాణం ఆధ్యాత్మిక ఉట్టిపడేలా నిర్మాణం జరగనుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఆలయ అభివృద్ధి పనులపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, పనులు శరవేగంగా చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్‌తో పాటు ఆలయ అభివృద్ధి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఆలయ విస్తరణ కోసం భూసేకరణ పూర్తయిందని, ఇప్పుడు ఆలయం చుట్టూ ఉన్న మాడ వీధుల విస్తరణ పనులు, ప్రాకార గోడల నిర్మాణాలు తక్షణమే ప్రారంభించాలని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. ఆగమశాస్త్ర ప్రమాణాలకు అనుగుణంగా ఆర్కిటెక్ట్ రూపొందించిన డిజైన్లను ఫైనల్ చేసి ఆలయ రూపకల్పనను వేగవంతం చేయాలని సూచించారు. ఆలయ నిర్మాణంలో ప్రతి అంశం ఆగమశాస్త్రం ప్రకారం ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి తుమ్మల అధికారులను ఆదేశించారు. భద్రాద్రి ఆలయాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం అని పేర్కొన్నారు. భక్తులకు వసతి, రవాణా, పార్కింగ్, నీటి సదుపాయాలు వంటి మౌలిక వసతులు కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని మంత్రి తుమ్మల సూచించారు. భద్రాద్రి రామాలయం పునరుద్ధరణ పూర్తయిన తర్వాత దేశవ్యాప్తంగా భక్తులను ఆకర్షించేలా ఉండాలని అన్నారు. ఆలయ అభివృద్ధి పనులు సమయ పాలన ప్రకారం సాగుతున్నాయో లేదో నిరంతరంగా పర్యవేక్షించాలని మంత్రి తుమ్మల ఆదేశించారు. ప్రతి దశ పనుల పురోగతిపై అధికారులు నివేదికలు సమర్పించాలని సూచించారు. భద్రాద్రి రామాలయం పునరుద్ధరణ పనులు పూర్తయిన వెంటనే అక్కడ విశాలమైన యజ్ఞశాల, మాడ వీధులు, ఆధునిక కట్టడాలతో కొత్త చరిత్ర సృష్టించనున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని మంత్రి తెలిపారు. భక్తుల విశ్వాసాన్ని కాపాడేలా దేవాదాయ శాఖ పనులు పారదర్శకంగా కొనసాగుతున్నాయని, భద్రాద్రి రామాలయం అభివృద్ధి ద్వారా తెలంగాణలో ఆధ్యాత్మిక పునరుజ్జీవనానికి నాంది పలుకుతుందని అన్నారు. ప్రభుత్వం భక్తుల నమ్మకాన్ని కాపాడే విధంగా దేవాదాయ శాఖను పారదర్శకంగా నడిపిస్తోందని, ఆలయాల సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలను కాపాడుతూ అభివృద్ధిని సమతుల్యంగా కొనసాగిస్తాం అని మంత్రి స్పష్టం చేశారు.



## ఆఫ్ఘనిస్థాన్‌కు అంబులెన్స్‌లు బహుమతిగా ఇచ్చిన భారత్

**న్యూఢిల్లీ:** ఆఫ్ఘనిస్థాన్‌కు ఐదు అంబులెన్స్‌లను భారత్ బహుమతిగా ఇచ్చింది. భారత్‌లో పర్యటిస్తున్న ఆ దేశ విదేశాంగ మంత్రి అమీర్ ఖాన్ ముత్తాకికి, విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ శుక్రవారం వీటిని అందజేశారు. సద్భావన సంజ్ఞగా ఆఫ్ఘనిస్థాన్‌కు 20 అంబులెన్స్‌ల బహుమతిలో భాగం ఆ దేశ విదేశాంగ మంత్రి సమక్షంలో ఐదింటిని అందజేసినట్లు ఆయన తెలిపారు. కాగా, కరోనా మహమ్మారి సమయంతో పాటు చాలా కాలంగా ఆఫ్ఘనిస్థాన్ ప్రజల ఆరోగ్య భద్రతకు భారత్ మద్దతిస్తున్నట్లు ఎస్ జైశంకర్ ఎక్స్ పోస్ట్‌లో పేర్కొన్నారు. ఆఫ్ఘన్ ఆసుపత్రులకు ఎంఆర్ఐ, సిటీ స్కాన్ యంత్రాలను కూడా అందిస్తామని తెలిపారు. రోగ నిరోధకత, క్యాన్సర్ వ్యాక్సిన్లతోపాటు యూఎన్ఓడీసీ ద్వారా ఔషధాలు, మెడికల్ సామగ్రిని సరఫరా చేసినట్లు వివరించారు. మరోవైపు ఆఫ్ఘనిస్థాన్‌కు మరింత సహాయం చేసేందుకు భారత్ సిద్ధంగా ఉన్నట్లు ఎస్ జైశంకర్ తెలిపారు. ఆరు కొత్త ప్రాజెక్టులను ఆ దేశంలో చేపడతామని చెప్పారు. ముఖ్యమైన దౌత్య చర్యలో భాగంగా కాబూల్‌లోని సాంకేతిక మిషన్‌ను భారత రాయబార కార్యాలయ హోదాకు శుక్రవారం అప్‌గ్రేడ్ చేసినట్లు ప్రకటించారు. ఆఫ్ఘన్ ప్రజల పొరుగు దేశంగా, శ్రేయోభిలాషిగా ఆ దేశ అభివృద్ధి, పురోగతిపై భారత్ చాలా ఆసక్తిగా ఉన్నదని వెల్లడించారు.



## హైదరాబాద్‌లో భారీగా డ్రగ్స్ పట్టివేత..

### ఏకంగా రూ.72 కోట్లు..!

**హైదరాబాద్,అక్టోబర్,10,తెలంగాణ దిశ :** హైదరాబాద్‌లో భారీగా డ్రగ్స్ పట్టుకున్నారు. జీడిమెట్లలో 220 కిలోల ఏపీడ్రిన్ డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. ఈ డ్రగ్స్ విలువ అంతర్జాతీయ మార్కెట్లో రూ.72 కోట్లు ఉంటుందని అంచనా.. బొల్లారంలోని సాయి దత్తా రెసిడెన్సీ ఫ్లాట్‌పై దాడి చేసి.. ఫ్లాట్ నుంచి 220 కిలోల ఏపీడ్రిన్ డ్రగ్ స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్ కింగ్ పిన్ శివ రామకృష్ణ, అనిల్, వెంకట కృష్ణారావు, దొరబాబు అరెస్ట్ చేసింది ఈగల్ టీం. మరో నిందితుడు సూళ్లూరుపేటకు చెందిన ఎం. ప్రసాద్ పరారీలో ఉన్నాడు. డ్రగ్ తయారీ కేంద్రం ఐడీఏ బొల్లారంలోని పీఎన్ఎం లైఫ్ సైన్సెస్ కంపెనీలో తయారు చేశారు.




## జూబ్లీహిల్స్ లో అంజన్ బిగ్ ట్విస్ట్..!

**హైదరాబాద్,అక్టోబర్,10,తెలంగాణ దిశ :** జూబ్లీహిల్స్ బై పోల్ వేళ కాంగ్రెస్ లో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. జూబ్లీహిల్స్ సీటు ఆశించిన మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ సంచలన నిర్ణయం దిశగా అడుగులు వేస్తున్నారు. సీటు ఖరారు వేళ తనతో సంప్రదించకపోవటం పైన అంజన్ అలక బూనారు. తన మద్దతు దారులతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. నాలుక దశాబ్దాలుగా పార్టీలో ఉన్న తనకు కనీస గౌరవం ఇవ్వలేదని వాపోయారు. రెబల్ అభ్యర్దిగా బరిలోకి దిగాలని అంజన్ పైన ఒత్తిడి పెరుగుతోంది. దీంతో.. అంజన్ నిర్ణయం పైన ఉత్కంఠ పెరుగుతోంది. జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్దిగా పార్టీ నాయకత్వం నవీన్ యాదవ్ ను ప్రకటించింది. ఈ సీటు కోసం మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ సైతం పోటీ పడ్డారు. పార్టీ అధినాయకత్వం నవీన్ యాదవ్ కు సీటు కేటాయించటంతో ఇప్పుడు అంజన్ తన మద్దతు దారులతో సమావేశం అయ్యారు. పార్టీ అభ్యర్ధి ఖరారు వేళ తనతో కనీసం సంప్రదించలేదని వాపోయారు. అంజన్ కుమారుడు ఎంపీగా ఉండటంతో... జూబ్లీహిల్స్ సీటు విషయంలో హైకమాండ్ పక్కన పెట్టింది. ఇప్పటికే అభ్యర్ధిని ఖరారు చేసినా.. అంజన్ తన పట్టు వీడటం లేదు.

### శబరిమల గర్భగుడి తాపడాల

## బరువులో తగ్గుదల..

### వెలుగులోకి సంచలన విషయాలు..!



**న్యూఢిల్లీ,అక్టోబర్,10:** శబరిమల ఆలయంలో గర్భగుడి ద్వారపాలక విగ్రహాలకు అమర్చిన బంగారు తాపడాలు బరువు తగ్గడంపై ప్రస్తుతం కేరళ హైకోర్టులో విచారణ జరుగుతుంది. బంగారు తాపడాల విషయంలో అన్ని జాగ్రత్తలు ఎందుకు తీసుకోలేదని న్యాయస్థానం ఈ సందర్భంగా ఆగ్రహం వ్యక్తం చేసింది. అయితే, తాపడాలకు అసలు ఏమైందనే అంశంపై జాతీయ మీడియాలో పలు ఆసక్తికర కథనాలు వెలువడ్డాయి. శబరిమల గర్భగుడి ముందున్న ద్వారపాలక విగ్రహాలపై ఉన్న బంగారు తాపడాలను మరమ్మతుల కోసం 2019లో తొలగించారు. ఆ సమయంలో వాటి బరువు 42.8 కిలోగ్రాములు.



## భాజపాతోనే బీసీలకు న్యాయం

### భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు

**హైదరాబాద్,అక్టోబర్,10,తెలంగాణ దిశ :** బీసీలను భారత రాష్ట్ర సమితి, కాంగ్రెస్ మోసం చేశాయని భాజపా తెలంగాణ అధ్యక్షుడు రామచందర్‌రావు విమర్శించారు. నాంపల్లిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో గ్రేటర్ పరిధి జిల్లాల సమావేశం నిర్వహించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ప్రచారం, అనుసరించాల్సిన వ్యూహాలపై నేతలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భాజపాతోనే బీసీలకు న్యాయం జరుగుతుందనే నిర్ణయానికి ప్రజలు కూడా వచ్చారన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెలుస్తామనే నమ్మకం తమకు ఉందని చెప్పారు. "నగరాన్ని ప్రపంచానికే తలమానికంగా మారుస్తామని భారత రాష్ట్ర సమితి గతంలో చెప్పింది.. కానీ అందుకు అనుగుణంగా ఎలాంటి ముందడుగు పడలేదు.

# ఆర్టీసీ ఛార్జీలను పెంచడం సరికాదు

## - సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్

**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 10, (తెలంగాణ దిశ) :**పెంచిన ఆర్ టిసి ఛార్జీలను తగ్గించాలని కోరుతూ శుక్రవారం సిపిఐ ఆధ్వర్యంలో జగద్గిరిగుట్ట చివరి బస్టాప్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం కొంత మంది పెట్టుబడిదారులకు కోట్లాది రూపాయలు ఇస్తూ, కోట్లాది మంది ప్రజలకు ఉపయోగపడే ఆర్ టి సి ఛార్జీలను పెంచడం అంటే ప్రభుత్వాలు ఉన్నవాళ్లకు ప్రజల నుండి వసూలు చేసి పెట్టుబడిదారులకు పంచడానికే ఉన్నాయని, ఇది తెలుసుకోలేని ప్రజలు బూర్జువా పార్టీలకు ఓట్లు వెయ్యడం ద్వారా ఇలాంటి కష్టాలు వస్తాయని ప్రజలు వాటిని గ్రహించేంత వరకు కమ్యూనిస్టులుగా పోరాటాలు నిర్వహిస్తామని అన్నారు. రేవంత్ రెడ్డి పేద ప్రజల పై భారం పడకుండా నిర్ణయాలు తీసుకోవాలని,వెంటనే పెంచిన ఛార్జీలను తగ్గించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.




ఈ కార్యక్రమంలో సిపిఐ సహాయ కార్యదర్శి హరినాథ్ రావ్, ఏఐటీయూసీ కార్యదర్శి శ్రీనివాస్, ప్రజా నాట్య మండలి అధ్యక్షులు ప్రవీణ్,సిపిఐ నాయకులు నర్సింహా రెడ్డి, వెంకటేష్, ఇమామ్, చంద్రయ్య, శ్రీనివాస్ చారీ,రాజు, సామెల్, యాదగిరి, నర్సింహ, చంద్రకాంత్, గురప్ప, ఆశప్ప, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రిజర్వేషన్లపై కాంగ్రెస్ నేతలు మోస పూరితమైన మాటలు ఆపాలి

**బీబీనగర్, అక్టోబర్ 10, (తెలంగాణ దిశ) :**రిజర్వేషన్లపై కాంగ్రెస్ నేతలు మోస పూరితమైన మాటలు ఆపాలని బిఆర్ఎస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు చింతల వెంకటేశ్వర రెడ్డి అన్నారు. శుక్రవారం బీబీనగర్ మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మోసాన్ని బిఆర్ఎస్ మొదటి నుండి చెబుతుందన్నారు. జీవో ద్వారా రిజిస్ట్రేషన్ల పక్రియ సాధ్యం కాదని బిఆర్ఎస్ పార్టీ పదే పదే చెబుతుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఉత్త ప్రగల్భాలు తప్ప పని చేసేది లేదని అనేక సందర్భాల్లో చెప్పినట్లు ఆయన గుర్తు చేశారు. తొమ్మిదివ షెడ్యూల్ లో చేర్చితే తప్ప రిజర్వేషన్ల అమలు అనేది కాదన్నారు. హైకోర్టు, సుప్రీంకోర్టుకు బీసీ మంత్రులు వెళ్ళి సాధించింది ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా రిజర్వేషన్లపై మోస పూరితమైన మాటలు కాంగ్రెస్ నేతలు ఆపాలని ఆయన హెచ్చరించారు. చట్ట బద్ధమైన బిసి రిజర్వేషన్ల అమలు కోసం బిఆర్ఎస్ చిత్తశుద్ధి తో ఉందన్నారు. కేంద్రంతో బిసి రిజర్వేషన్ల అమలుపై పోరాటానికి కేసీఆర్ నాయకత్వంలో బిఆర్ఎస్ పార్టీ సిద్ధంగా ఉ ందన్నారు. మీ బడే బాయ్ ప్రధాని మోదీ కొట్లాటకు సిద్ధమా అని



ప్రశ్నించారు. బిసి మేధావులు, నాయకులు ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కోవాలని హితువు పలికారు. ఎన్నికలు ఎప్పుడూ వచ్చిన బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మల్గారి శ్రీనివాస్, రాజమళ్ళ శ్రీనివాస్, బొక్క జైపాల్ రెడ్డి, చింతల సుదర్శన్, గుంటిమీది దయాకర్,గుంటిమీది అశోక్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు కుతాడి సురేష్, నాయకులు జక్కి నాగేష్, మోతె మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# కుషాయిగూడ పీహెచ్‌సీలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవంపై అవగాహన




**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 10, (తెలంగాణ దిశ) :**జిల్లా వైద్య ఆరోగ్య అధికారి ఆదేశాల మేరకు ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవంను పురస్కరించుకుని కుషాయిగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎన్ సిడి (నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్) ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ మల్లీశ్వరి, కీసర డిప్యూటీ జిల్లా వైద్య అధికారి డాక్టర్ సత్యవతి పర్యవేక్షించారు. ఇందులో రోగులు, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలకు మానసిక ఆరోగ్యంపై విలువైన సూచనలు ఇచ్చారు. ఆరోగ్యకర జీవన విధానం కోసం మంచి ఆహారం స్వీకరించాలని, ఇతరులతో స్నేహపూర్వకంగా సంభాషించడం ద్వారా మానసిక ఒత్తిడి ని తగ్గించుకోవచ్చని వైద్యులు వివరించారు. మానసిక సమస్యలతో బాధపడుతున్న వ్యక్తులు తప్పనిసరిగా మానసిక వైద్యులను సంప్రదించాలని సూచించారు. మానసిక అనారోగ్యం కలిగిన వారు సహాయం కోసం టోల్-ఫ్రీ నంబర్ 14416కు ఫోన్ చేయవచ్చని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో పి హెచ్ సి ఇంచార్జీ డాక్టర్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.




# గాజుల రామారంలో పార్కు స్థలానికి ఫెన్సింగ్ వేసిన హైడ్రా

**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 10, (తెలంగాణ దిశ) :**గాజులరామారం సర్వేనెంబర్ 329/4 నుండి 329/10 ప్రభుత్వ స్థలం గైరాన్ భూమిలో ఉన్న పార్కు స్థలానికి శుక్రవారం హైడ్రాధికారులు ఫెన్సింగ్ వేసి ఆ స్థలాన్ని కాపాడారు. మొత్తం మహదేవపురం కాలనీలో సుమారు 12 ఎకరాల యమ్యూనిటీస్ స్థలం నెలకుని ఉండగా అందులో లేఅవుట్లను మారుస్తూ పార్కు స్థలాలను క్రమేపీ కనుమరుగు అయ్యేటట్టు కొందరు దళారులు కుట్రలు పని స్థలాలు కబ్జా పెట్టి నిర్మాణాలు గావించారు. కాలనీవాసుల ఫిర్యాదు మేరకు హైడ్రాధికారులు పోలీసుల సహకారంతో శుక్రవారం ఉదయం మహదేవపురం లేఅవుట్ లోని సుమారు 1200 గజాల పార్కు స్థలాన్ని కాపాడి దానికి ఫెన్సింగ్ వేశారు. మహాదేవపురం కాలనీలోని స్థానిక అన్నపూర్ణ మందిర్ వద్ద ఉన్న ఈ పార్కు స్థలాన్ని గుర్తు తెలియని వ్యక్తులు విక్రయానికి బేరాలు పెడుతున్నట్టు తెలియడంతో స్థానికులు హైడ్రాధికారులను ఆశ్రయించారు. దీంతో



శుక్రవారం హైడ్రాధికారులు స్థానిక పోలీసుల సహకారంతో 1200 గజాల పార్కు స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేసి దానిని మున్సిపల్ అధికారులకు అప్పగించారు.

# నాగారం ఉన్నత పాఠశాలలో సైన్స్ ఫేయిర్







**నాగారం, అక్టోబర్ 10, (తెలంగాణ దిశ) :**నాగారం పాఠశాలలో సైన్స్ ఫెయిర్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కీసర మండల విద్యాశాఖ అధికారులు జమదగ్ని, చీర్యాల ప్రధాన ఉపాధ్యాయులు రవీందర్, హాజరు అయ్యారు. ప్రధానోపాధ్యాయులు పి సి రాములు జ్యోతి ప్రజ్వలన చేశారు. విద్యార్థులు నూతన ఆవిష్కరణలతో నమూనాలు తయారు చేశారు. ఆకర్షణీయంగా వివరించారు. సైనికులకు చలి కాలంలో కూడా వేడిగా ఉండే సోలార్ ప్యానెల్



కోట్లు, ఫ్యాక్టరీ నుండి వచ్చే కాలుష్యంను ఫిల్టర్ చేసే నమూనాలు తయారు చేశారు. ఈ కార్యక్రమాన్ని అగస్త్య ఫౌండేషన్ సభ్యులు త్రివేణి, ఆప్షన్ ఆధ్వర్యంలో జరిగింది. పాఠశాల సైన్స్ ఉపాధ్యాయులు రమా సత్యశ్రీ, కమల, అర్చన, సంధ్యరాణి, వందనలు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజ్యలక్ష్మి, అరవింద్ కుమార్, రఘు,శ్రీదేవి, అజీజ్ అహ్మద్, పద్మ, గాయత్రి, వరమ్మ, సంజయ్ రాణీ, పాండురంగా రెడ్డి, సుప్రజ,విద్యా వాలంటీర్ స్వప్న, పావని, పవిత్ర తదితరులు పాల్గొన్నారు.

# సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి






**కీసర, అక్టోబర్ 10, (తెలంగాణ దిశ) :**కీసర డివిజన్ పరిధిలో సమాచార హక్కు చట్టం -2005 పై అవగాహన సదస్సు శుక్రవారం కీసర తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కీసర ఆర్డీఓ కె. వెంకట ఉపేందర్ రెడ్డి, కీసర తహశీల్దార్ అశోక్ కుమార్ డివిజన్ పరిధిలోని 8 తహసీల్దార్ కార్యాలయాలకు చెందిన పౌర సమాచార అధికారులు, సహాయ పౌర సమాచార అధికారులు, సమాచార హక్కు కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు. ఈ సమావేశంలో కీసర ఆర్డీఓ మాట్లాడుతూ పరిపాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించడం కోసం సమాచార హక్కు చట్టం -2005 తీసుకురావడం జరిగిందని, ఈ చట్టం యొక్క ప్రాధాన్యత, చట్టంలోని ప్రధాన అంశాలను, వివిధ సెక్షన్ లను వివరించారు. ప్రజలందరూ ఈ చట్టం పై అవగాహన పెంపొందించుకొని దుర్వినియోగం కాకుండా సద్వినియోగ పరచుకోవాలని కోరారు. డివిజన్ పరిధిలోని పౌర సమాచార అధికారులు సకాలంలో ప్రజలకు కోరిన సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం లో తెలంగాణ సాంస్కృతిక సారధి ఆధ్వర్యంలో కళాకారులు సమాచార హక్కు చట్టంపై సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు.

# కుషాయిగూడలో రూ. 50 కోట్ల విలువ చేసే అసైన్డ్ భూములు దర్జా కబ్జా...?

## - పరదా మాటున - రాత్రికి రాత్రే జోరుగా వెలుస్తున్న బహుళ అంతస్తుల కట్టడాలు...

## - కాప్రా మండల తహసిల్దార్ స్పందించాలని చర్లపల్లి కాలనీల సిసిఎస్ కుటుంబాల పక్షాన విజ్ఞప్తి

**కుషాయిగూడ, అక్టోబర్ 10, (తెలంగాణ దిశ) :**కాప్రా మండల రెవెన్యూ పరిధి కుషాయిగూడ జమ్మిగడ్డ రెవెన్యూ పరిధిలోని ఆర్కిడ్స్ ఇంటర్నేషనల్ స్కూల్, భాష్యం స్కూల్స్ కు ఆనుకొని కోట్లాది రూపాయల విలువచేసే భూములు దర్జాగా కబ్జాకు గురవు తున్నాయి. కాప్రా మండల తహసిల్దార్ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఈ తతంతం జరుగుతుంది. పరదలు, గోడలు కట్టి రాత్రికి రాత్రే



బహుళ అంతస్తుల భవనాలను దర్జాగా నిర్మించేస్తున్నారు. కాప్రా మండల తహసిల్దార్ సుచరిత గారు వెంటనే స్పందించి రూ. 50 కోట్ల విలువ చేసే అసైన్డ్ భూములలో వెలుస్తున్న అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలని చర్లపల్లి కాలనీల సిసిఎస్ కుటుంబాల పక్షాన విజ్ఞప్తి చేశారు.

# చదువులలో ప్రతిభ కనబరుస్తున్న ప్రతి ఒక్కరికి సహకారం అందిస్తా

## - ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి





**కుషాయిగూడ, అక్టోబర్ 10, (తెలంగాణ దిశ) :**ఉన్నత చదువులలో ప్రతిభ కనబరిచే విద్యార్థులకు అండగా ఉంటూ వారి కుటుంబాలకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. గ్రూప్ 1 పరీక్షలోఉత్తీర్ణత సాధించి డిప్యూటీ సూపర్డెంట్ ఆఫ్ పోలీస్ డిఎస్ పి గా ఎంపికైన దిరావత్ సబితని లక్ష్మారెడ్డి శుక్రవారం ఏఎస్ రావునగర్ కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీష సోమశేఖర్ తో కలిసి నాగార్జున నగర్ లోని వారి నివాసంలో శాలువా కప్పి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఎస్ పి గా బాధ్యతలు చేపట్టి జనరంజకమైన పరిపాలన అందించాలని సబితకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, చర్లపల్లి కాలనీల సమాఖ్య సిసిఎస్ అధ్యక్షులు ఎంపల్లి పద్మారెడ్డి, పాండాల శివకుమార్ గౌడ్, నాగార్జున నగర్ కాలనీ అధ్యక్షులు యావపురం రవి, సారా వినోద్ ముదిరాజ్, శ్రీశైలం, ప్రసాద్ రెడ్డి, జై కృష్ణ, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# కొలన్ హంసమ్మకు ఘనంగా నివాళులు





**బీబీనగర్, అక్టోబర్ 10, (తెలంగాణ దిశ) :**భువనగిరి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కొలను లావణ్య దేవేందర్ రెడ్డి తల్లి కొలను హంసమ్మ గత పది రోజుల క్రితం పరమ పదించారు. శుక్రవారం బీబీనగర్ మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలో దశదినకర్మ సందర్భంగా వారి నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను బిఆర్ఎస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు చింతల వెంకటేశ్వర రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కొలను భూపాల్ రెడ్డి,కొలను శ్రీనివాస్ రెడ్డి, పంజాల సురేష్ గౌడ్, గుంటిమీది దయాకర్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు కుతాడి సురేష్, మోతె మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# అసైన్ భూముల అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకుంటాం

## - కాప్రా తహసిల్దార్ సుచరిత



**కాప్రా, అక్టోబర్ 10, (తెలంగాణ దిశ) :**కుషాయిగూడలో అసైన్డ్ భూముల అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని కాప్రా తహసిల్దార్ సుచరిత స్పష్టం చేశారు. శుక్రవారం కుషాయిగూడ జమ్మిగడ్డ అర్చిడ్ ఇంటర్నేషనల్ స్కూల్ అసైన్డ్ భూములలో వెలిసిన నిర్మాణాలను ఆమె సందర్శి ంచారు. తక్షణమే ఈ అక్రమ నిర్మాణాలను తొలగించి ఫెన్సింగ్ ఏర్పాటుతో పాటు బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇక్కడ అక్రమ లే అవుట్ చేసి ప్లాట్లను విక్రయిస్తున్నారని జిల్లా అధికారులకు పలు ఫిర్యాదులు



అందాయి. కలెక్టర్ ఆదేశాల మేరకు ఎమ్మార్వో విచారణ జరిపారు. దీనిని అసైన్ భూమిగా గుర్తించారు. అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని నిర్ధారించారు. అక్రమ నిర్మాణాలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# సంపాదకీయం

## స్మార్ట్ ఫోన్లపై నియంత్రణ ఏదీ..?

భారతదేశంలో స్మార్ట్‌ఫోన్‌లు పిల్లల మానసిక, శారీరక భద్రతకు పెనుముప్పుగా మారుతున్నాయి. స్మార్ట్‌ఫోన్ల ద్వారా పోర్నోగ్రఫీ, హింసాత్మక కంటెంట్‌కు వ్యసనపరులవుతున్నారు. ఈ నేరాలు శ్రుతి మించకముందే ప్రభుత్వం వీటి నేపథ్యాన్ని అధ్యయనం చేసి చిన్న పిల్లలకు స్మార్ట్‌ఫోన్‌లు అందుబాటులో ఉండకుండా చర్యలు తీసుకోవాలి. సామాజిక అభ్యసన సిద్ధాంతం ప్రకారం ఇతరులను వ్యక్తులు, ముఖ్యంగా పిల్లలు గమనించడం ద్వారా, అనుకరించడం ద్వారా ప్రవర్తనలను నేర్చుకుంటారు. స్మార్ట్‌ఫోన్‌లలోని హింసాత్మక, అశ్లీల కంటెంట్ నిరంతర వీక్షణం వారిలో ఆ ప్రవర్తనలను సాధారణీకరించడానికి, సున్నితత్వాన్ని కోల్పోవడానికి దారి తీస్తుంది. ఇప్పటికే బ్రిటన్‌లో 16 ఏళ్ల లోపు పిల్లలకు స్మార్ట్‌ఫోన్ల విక్రయాన్ని నిషేదించే ప్రతిపాదనపై చర్చ జరుగుతుంది. భారత్‌లో ఈ పరిస్థితి మరింత తీవ్రంగా ఉంది. ఇక్కడ 11 ఏళ్లకే పిల్లలు స్మార్ట్‌ఫోన్‌లు వాడుతూ కాలం గడుపుతున్నారు. పెరుగుతున్న సెల్?ఫోన్? వినియోగం పిల్లల మీద తీవ్రంగా ప్రభావం చూపుతోంది. కొన్నేళ్ల క్రితం చందమామను చూపి భోజనం తినిపించే తల్లులు ప్రస్తుతం స్మార్ట్?ఫోన్?లను చూపిస్తున్నారు. ఇక చదువు పేరుతో స్మార్ట్?ఫోన్? వినియోగానికి అలవాటైన పిల్లలు, యువతీ యువకులు వాటికి పూర్తిగా బానిసలవుతున్నారు. చుట్టూ ఉండే సమాజానికి మరింత దూరమవుతున్నారు. ఫ్యామిలీ మెంబర్లు, బంధువులు, స్నేహితులను కలిసి మాట్లాడే పరిస్థితి అనేదే కనిపించడం లేదు. నిత్యం సెల్‌ఫోన్‌లో రీల్స్, షార్ట్స్ చూస్తూ విలువైన సమయాన్ని వృథా చేసుకుంటున్నారు.ఫ్రాన్స్ ప్రభుత్వం 15 ఏళ్లలోపు పిల్లలు సోషల్? మీడియాకు దూరంగా ఉండేలా నిషేధిస్తామని ఆ దేశ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ తెలిపారు. పిల్లలపై సోషల్ మీడియా దుష్ప్రభావాన్ని తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకుంటున్నామన్నారు.చాలా మంది బాలలు చదువుల కోసం, వినోదం కోసం సెల్?ఫోన్?లను వినియోగిస్తున్నారు. ఇటీవల కాలంలో అధిక శాతం మంది ఇళ్లలో వైఫై సౌకర్యం కల్పించడంతో వీటి వినియోగం మరింత పెరుగుతోంది. కరోనా సమయంలో ఆన్‌లైన్ క్లాస్?లతో స్మార్ట్?ఫోన్?లకు అలవాటైన విద్యార్థులు పాఠశాల నుంచి ఇంటికి రాగానే ఫోన్ పట్టుకునే ఉంటున్నారు. తల్లిదండ్రులు హెచ్చరించినప్పటికీ పెడచెవిన పెడుతున్న ధోరణి క్రమంగా పెరుగుతోంది.ఎక్కువసేపు ఫోన్ వాడటం వల్ల శరీర ఒత్తిడి పెరుగుతుందని, ఇది క్రమరహిత హృదయ స్పందన రేటుకు దారితీస్తుందని, హృదయ సంబంధ వ్యాధుల ప్రమాదాన్ని పెంచుతుందని పరిశోధనలో తేలింది. ముఖ్యంగా "నోమోఫోబియా" వంటి పరిస్థితి – అంటే, ఫోన్ నుండి దూరంగా ఉన్నప్పుడు నాడీగా లేదా ఆందోళనగా అనిపించడం వల్ల గుండెపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. స్మార్ట్‌ఫోన్ నుండి వెలువడే నీలి కాంతి నిద్ర నాణ్యతను కూడా ప్రభావితం చేస్తుంది. ఇది గుండె ఆరోగ్యానికి ముఖ్యమైనది.వేగవంతం చేయడం, రక్తపోటును పెంచడం, హృదయనాళ వ్యవస్థను ప్రభావితం చేయడం ప్రారంభిస్తుంది. మనస్సు పదే పదే ఒత్తిడికి గురైనప్పుడు, శరీరం పోరాటం లేదా పారిపోయే ప్రతిచర్య చురుకుగా మారుతుంది. ఇది హృదయ స్పందనను వేగవంతం చేస్తుంది.నోమోఫోబియా అంటే నో మొబైల్ ఫోన్ ఫోబియా అనేది ఒక వ్యక్తి ఫోన్ లేకుండా భయం, విశ్రాంతి లేకపోవడం వంటి లక్షణాలను అనుభవించే పరిస్థితి. ఈ ఆందోళన నేరుగా మీ నాడీ వ్యవస్థను ప్రభావితం చేస్తుంది. దీని కారణంగా, హృదయ స్పందన పెరుగుతుంది. హృదయ స్పందన రేటు సక్రమంగా మారవచ్చు. ఈ పరిస్థితి చాలా కాలం పాటు కొనసాగితే, గుండె జబ్బుల ప్రమాదం పెరుగుతుంది.రోజుకు 5 గంటలకు పైగా స్మార్ట్‌ఫోన్‌లను ఉపయోగించే వారిలో తక్కువ హృదయ స్పందన రేటు వేరియబిలిటీ ఉందని యూరోపియన్ అధ్యయనం వెల్లడించింది. ఇది గుండె ఆరోగ్యానికి ప్రతికూల సంకేతం. అమెరికాలో కూడా జరిగిన కార్డియాలజీ సమావేశంలో నిపుణులు డిజిటల్ ఒత్తిడి కారణంగా గుండె జబ్బుల ప్రమాదం కొత్త తరంలో వేగంగా పెరుగుతోందని చెప్పారు.నిజానికి బ్రిటన్ కంటే ముందు భారత్‌లో పిల్లలు స్మార్ట్‌ఫోన్ల వాడడంపై కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరముంది. ఇందుకు తల్లిదండ్రుల ఆందోళనను, సూచనలను పరిగణలోకి తీసుకొని చట్టాన్ని రూపొందించాలి. స్మార్ట్‌ఫోన్ల వ్యసనం మన పిల్లల బాల్యాన్ని, మన సమాజ భద్రతను నాశనం చేయకముందే ప్రభుత్వాలు తక్షణమే స్పందించాల్సిన అవసరముంది. సెల్?ఫోన్?కు బానిసలుగా మారే వారు ఎక్కువ మందితో అంతగా కలిసిపోలేరు. సోషల్ మీడియా ప్రపంచంలోనే ఉండేవారు నిజమైన లోకంలో జీవించలేరు. పక్కనున్న రిలేటివ్స్, ఫ్రెండ్స్?ను కలవాలనే ఆసక్తి తగ్గిపోతుంది. ఎవరితోనూ మనసు విప్పి మాట్లాడలేరు. భావాలను కూడా వ్యక్తం చేయలేరు. మానసిక ఎదుగుదల కూడా తగ్గిపోయేటువంటి అవకాశాలు ఉంటాయి' అని గోదావరిఖనికి చెందిన మానసిక వైద్య నిపుణులు రవివర్మ తెలిపారు.

## జై జవాన్ కాలనీ షాపింగ్ కాంప్లెక్స్ ను
# వేలంలో అర్హులకు కేటాయించాలి



**ఏఎస్ రావునగర్, అక్టోబర్ 10, (తెలంగాణ దిశ) :** జిహెచ్ఎంసి స్వాధీనం చేసుకున్న జై జవాన్ కాలనీలోని కమర్షియల్ కాంప్లెక్స్ లోని పది షటర్లను వేలంలో అర్హులైన వారికి కేటాయించాలని సమాచార హక్కు సాధన సమితి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కన్వీనర్ తాడూరి గగన్ కుమార్ డిమాండ్ చేశారు. కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గత పది సంవత్సరాలుగా ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ ను ఇటీవల జిహెచ్ఎంసి స్వాధీనం చేసుకున్న విషయం విధితమే. షాపింగ్ కాంప్లెక్స్ ను స్వాధీనం చేసుకున్న రెండు నెలలు అవుతున్న జిహెచ్ఎంసి అధికారులు షట్టర్లను వేలం వేయడం లేదని ఆయన అన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్తామని చెప్పారు.
తక్షణమే షట్టర్లను వేలం వేసి నిరుద్యోగులకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో అధికారులు సానుకూలమైన నిర్ణయం తీసుకోకపోతే అవసరమైతే ఆమరణ నిరాహార దీక్ష చేపడతారని ఆయన హెచ్చరించారు. షట్టర్లను వేయడంవేలం వేయడం ద్వారా జిహెచ్ఎంసికి ఆదాయం సమకూర్తుందన్నారు.కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఇన్నాళ్లు జిహెచ్ఎంసికి రావాల్సిన ఆదాయానికి గండిపడిం దన్నారు.



ఇప్పటికైనా జిహెచ్ ఎంసి అధికారులు మేలుకొని జై జవాన్ కాలనీ షాపింగ్ కాంప్లెక్స్ సముదాయంలోని పది షటర్లను ఓపెన్ వేలం ద్వారా వేలం వేసి నిరుద్యోగులకు అవకాశం కల్పించాలని ఆయన కోరారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

## జూబ్లీహిల్స్ బరిలో టిపిఎస్ అభ్యర్థి



**హైదరాబాద్, అక్టోబర్ 10, (తెలంగాణ దిశ) :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో తెలంగాణ రాష్ట్ర పునర్ నిర్మాణ సమితి (టిపిఎస్) అభ్యర్థి పోటీలో ఉంటారని పార్టీ వ్యవస్థా పకురాలు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాటూరి యశోదర స్పష్టం చేశారు. వెనుకబడిన తరగతులకు చెందిన (బీసీ) అభ్యర్థిని పోటీలో నిలుపుతామన్నారు. బుధవారం ఆమె విలేఖరు లతో మాట్లాడుతూ జూబ్లీ హిల్స్ లో ఎప్పుడు సంపన్న వర్గాల అభ్యర్థులే ఎన్నికలలో నిలిచి గెలుపొందుతున్నారని, ఈ సారి టిపిఎస్ పార్టీ తరుపున బీసీ అభ్యర్థినీ బరిలో నిలుపుతామని అన్నారు. గతంలో పది సంవత్సరాలు పరిపాలించిన బిఆర్ఎస్, ప్రస్తుత అధికార పార్టీలకు ఈ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని అన్నారు.
గత ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చ లేదన్నారు. అనేక సంక్షేమ పథకాలను ప్రకటించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. అన్ని వర్గాల మద్దతుతో వెనుకబడిన వర్గాల అభ్యర్థి విజయం సాధించడం తధ్యమన్నారు.

## నెగెటివ్ ఎనర్జీని వదిలించుకోవాలి!

**తిరుమల,తెలంగాణ దిశ:**మన శరీరంలోకి అధికమొత్తంలో ప్రాణ శక్తిని చేర్చే ఏకైక మార్గం ధ్యానం, యోగాయే... అందుకే భారతీయ ఋషులు ధ్యానం, యోగ మార్గాన్నే అనుసరించారు. రోజూ కనీసం అర గంట... ధ్యానం, యోగ చెయ్యండి... ఆరోగ్యంగా జీవించండని తెలిపారు. అలాగే నెగెటివ్ థాట్స్‌కు దూరంగా ఉండాలి. అలా ఉంటేనే మన అవయవాలు సరిగా పనిచేస్తాయి.
లేకుంటా వాటిపై ప్రభావం పడి అవి పనిచేయకుండా చచ్చుపడతాయి. మన శరీరం లోకి వెళ్లిన ఆహారం 24 గంటల్లో... మలినంగా బయటికి వెళ్లిపోవాలి. లేకపోతే ఆ మలినాలు జబ్బులకు కారణం అవుతాయి. .మన శరీరం లోకి వెళ్లిన నీరు 4 గంటల్లో బయటికి వెళ్లిపోవాలి, లేకపోతే జబ్బులు తప్పవు.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి
# మహిళా కాంగ్రెస్ పూర్తి మద్దతు



**జూబ్లీహిల్స్, అక్టోబర్ 10, (తెలంగాణ దిశ) :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి మహిళా కాంగ్రెస్ పూర్తి మద్దతు ఇస్తున్నట్లు మహిళా కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు మొగిలి సునీతారావు స్పష్టం చేశారు. శనివారం యూసఫ్ గూడ చెక్ పోస్ట్ నవీన్ యాదవ్ స్వగృహంలో అభ్యర్థి నవీన్ యాదవ్ ను కలిసి మహిళా కాంగ్రెస్ నేతలు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా సునీతా రావు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలే కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయానికి సోపానాలని అన్నారు.
ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ఇంటింటికి ప్రచా రం చేసి నవీన్ యాదవ్ అఖండ మె జారిటీతో గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం లో సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షురాలు కవిత,



ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షురాలు శంబుల ఉషశ్రీలతో పాటు కాంగ్రెస్ మహిళ కమిటీ సభ్యులు, నాయకురాళ్లు, కార్యకర్తలు భారీగా తరలి వెళ్లి నవీన్ యాదవ్ కు మద్దతు తెలిపారు.

# అప్పుల ఊబినుంచి బయటపడేదెలా..?

రాష్ట్రాలు ఆర్థికంగా దెబ్బతిని అప్పులపాలు అయినా..కేంద్రం చోద్యం చూస్తోంది. ఇబ్బడిముబ్బడిగా అప్పులు చేస్తున్న ప్రాంతీయ పార్టీల నేతలు అభివృద్ధి పేరుతో అప్పులు చేస్తున్నారు. పలు సందర్భాల్లో ఎన్నికల సంఘం,సుప్రీంకోర్టు గట్టిగానే హెచ్చరిస్తోంది. ఉచిత పథకాలతో జీతాలు కూడా చెల్లించడం గగనంగా మారుతోంది. ఈ దుస్థితి పోవాలి. ఇందుకు తెలుగు రాష్ట్రాల్లో అప్పులే నిదర్శనం. ఇలా ఎవరి ఇష్టం వచ్చినట్లుగా వారు అప్పులు చేయడం, అందుకు కేంద్రం అనుమతించడం, ఆ భారం ప్రజలు భరించాల్సి రావడం ఎంతకాలం అన్నది ప్రశ్నించుకోవాలి. రాష్ట్రాలు జీతాలు కూడా సక్రమంగా చెల్లించు కోలేక, ఉద్యోగులు రిటైర్ అయితే బెనిఫిట్స్ చెల్లించలేక నానాయాతన పడుతున్నాయి. అయినా ఉచిత పథకాలు, పెన్షన్లనే అభివృద్ధిగా చూపుతున్నారు. వీటన్నిటికన్నా రాజకీయ నాయకుల జీతభత్యాలే అత్యధికంగా ఉంటున్నాయి. దీనిని కూడా ముందుగా అరికట్టాలి. రాజకీయంగా దుబారాలపై దృష్టి పెట్టాలి. ఇకపోతే కేంద్రం కూడా రాష్ట్రాలను ఆర్థికంగా దెబ్బతీయడం..వారు పథకాలను సక్రమంగా అమలు చేయలేక పోవడం...అప్పులను బూచిగా చూపి దెబ్బతీయడం వంటి ప్రణాళికలతో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వ్యవహరిస్తోంది. మోడీ అధికారంలోకి వచ్చాక కేంద్ర రాష్ట్రాల మధ్య సఖ్యత దెబ్బతినడానికి ఇదే కారణం. రాష్ట్రాల ఆదాయ వనరులను దెబ్బతీయడమే గాకుండా నీతి ఆయోగ్ సిఫార్సుల మేరకు రావాల్సిన మొత్తాలను జిఎస్టీ ద్వారా అందడం లేదు. ప్రధానంగా కేంద్ర పన్నుల్లో రాష్ట్ర వాటా నిధులకు సంబంధించి కూడా అన్యాయమే జరుగుతోంది. మొత్తం పన్నుల్లో 42శాతం నిధులను రాష్ట్రాలకు పంపిణీ చేయాల్సి ఉండగా గడిచిన సంవత్సరాల్లో 37 శాతం నిధులనే పంపిణీ చేసింది. ఇప్పుడు జిఎస్టీ ఆదాయం తగ్గడం వల్ల రాష్ట్రాల ఇప్పుడు మరింత ఖర్చుల భారం పెరిగే అవకాశం ఉంది. ఏటా 5వేల కోట్ల ఆదాయం కోల్పోతామని ఇప్పటికే డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క అన్నారు. ఆదాయం తగ్గినా ప్రజలకు మేలు జరగాలని ఎపి సిఎం చంద్రబాబు అన్నారు, ఇకపోతే వివిధ పథకాలతో




కాకుండా నేరుగా ఉమ్మడి పథకాలకు కేంద్ర రాష్ట్రాలు ఖర్చు చేయాల్సి ఉంటుంది. పన్నుల వాటా నిధులను సక్రమంగా విడుదల చేయడానికి కేంద్రం చొరవ తీసుకోవాలి. ఉచిత పథకాల పుణ్యమా అని అనేక రాష్ట్రాల్లో అప్పులపైనే భారం వేయాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. ఇందుకు ఉమ్మడి తెలుగు రాష్ట్రాలే నిదర్శనం. ఇకపోతే ఎముకే లేదన్నట్లుగా అనేక రాష్ట్రాలు కూడా ఇబ్బడి ముబ్బడిగా అప్పులు చేస్తూ పోతున్నాయి. అప్పులు చేస్తూ సంక్షేమం పేరిట ఆర్థికస్థితిని దివాళా తీయి స్తున్నాయి. విభజన హామీలతో పాటు, అనేకపథకాల అమలుకు సంబంధించిన నిధులు కూడా కేంద్రం సక్రమంగా ఇవ్వడం లేదు. వైఎస్ జగన్, కెసిఆర్‌లు దుబారాలు చేసి రాష్ట్రాలను దివాళా తీయించారు. దీంతో రాష్ట్రాల ప్రగతి కుంటు పడుతోంది. అదే సమయంలో అప్పులు తెచ్చుకున్నా ఉదార పథకాలకు పందేరం చేస్తున్నారు. దీంతో రాష్ట్రాలు అప్పుల ఊబిలో కూరుకు పోతున్నాయి. అప్పులు చేసిన డబ్బులతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నామని, ఆర్థికస్థితి బలంగా ఉందని ఉభయ తెలుగురాష్ట్రాల సిఎంలు నిస్సిగ్గుగా ప్రకటిస్తున్నారు. నిజానికి అప్పులతో రాష్ట్రాలు కుదేలవు తున్నాయి. మరోవైపు రాష్ట్రాలకి ఎంతో చేస్తున్నామని కేంద్ర ప్రభుత్వ ప్రచారం చేసుకుంటున్నది. ఏమి చేశారో వివరాలు చెప్పడం లేదు. ఎపిలో కీలకమైన రెవెన్యూ లోటు అంశం ఇప్పటికీ అపరిష్కృతంగానే ఉండిపోయింది. రాష్ట్ర విభజన జరిగిన తరువాత 2014–15లో ఎపి రాష్ట్ర లోటు రూ.16వేల కోట్లుగా ఉన్నట్లు కాగ్ తేల్చింది. ఈ వివరాలను రాష్ట్ర అధికారులు కేంద్రం దృష్టికి తీసుకు వెళ్లారు. అయితే, వీటిని మోడీ సర్కారు పట్టించు కోలేదు. అలాగే తొలి ఐదేళ్ల కాలానికి సంబంధించి కూడా లోటు వివరాలను ఎప్పటికప్పుడు రాష్ట్ర అధికారులు కేంద్రానికి సమర్పించారు. పోలవరం అంచనాలపై పదేపదే చెబుతూ నిధులు విడుదల చేయాలని కోరారు. విద్యుత్, వ్యవసాయ రంగాల్లో సంస్కరణలు అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తోంది.
అమరావతి రాజధాని నిర్మాణ బాధ్యతతమదేనని చెప్పుకున్న కేంద్రం కేవలం రూ.1500 కోట్లు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకొంది. రాష్ట్ర పథకాలకు కేంద్రం అందించే నిధుల్లో కూడా కోతలు పెరుగుతున్నట్లు ఆర్థికశాఖ చెబుతోంది. మోడల్ స్కూల్స్, పోలీస్ మోడర్నైజేషన్ స్కీమ్, మెగా ఫుడ్ ప్రాసెసిరగ్ యూనిట్లు, ఇతర నీటిపారుదల, రహదారుల నిర్మాణంవంటి పథకాలకు నిధులు తగ్గినట్లు ఆర్థికశాఖ చెబుతోంది. రాష్ట్ర విభజన సమయంలో ఏడు వెనుకబడిన జిల్లాలకు ఆర్థికసాయం చేస్తామని చెప్పిన కేంద్రం మూడేళ్లకే చేతులెత్తేసింది. నీతి ఆయోగ్ ఏర్పాటు సందర్భంగా ప్రధాని మోడీ కూడా కేంద్ర రాష్ట్ర సంబంధాలపై కొత్తనిర్వచనం ఇచ్చారు. కానీ మోడీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రాలను విశ్వాసంలోకి తీసుకోవడం లేదన్న విమర్శలు వస్తూనే ఉన్నాయి. నిధుల కేటాయింపు మొదలు, అభివృద్ధి పనులు కూడా పరస్పర విశ్వాసంతో కొనసాగించాలి. రాష్ట్రాలు తప్పుదోవ పడుతున్న సందర్భంలో అవసరమైన హెచ్చరికలు కూడా చేయాలి. తాజాగా మారిన రాజకీయాల క్రమంలో ఆయా రాష్ట్రాల ఆర్థిక స్తితిపైనా నీతి ఆయోగ్ ద్వారా హెచ్చరికలు చేయడం మంచిదే.

# ట్రంప్ సుంకాలకుకారణాలు అనేకం



న్యూఢిల్లీ, : ట్రంప్ భారీ సుంకాల విధింపు వెనక అనేకానేక కారణాలు ఉన్నాయని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. కేవలం రష్యా (నుంచి చమురు కొనుగోలు చేస్తున్నారనే కారణంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్ పై భారీగా సుంకాల భారాన్ని మోపారనడానికి లేదంటున్నారు. ఇదొకకారణం మాత్రమేనని, అలాంటివి ఎన్నో ఇప్పుడు ఆన ముందుకేసుకుని ఉన్నారని అంటున్నారు. ట్రంప్ సుంకాల విధింపుపై భారత మాజీ దౌత్యవేత్త వికాస్ స్వరూప్ మాట్లాడుతూ.. కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్– పాక్ మధ్య జరిగిన కాల్పుల విరమణలో ఎవరి ప్రమేయం లేదని న్యూఢిల్లీ పేర్కొనడంతోనే సుంకాలు విధించారని విమర్శించారు. ఈ వ్యవహారంలో ట్రంప్ పదేపదే పెద్దన్న పాత్ర పోషించినట్లు ప్రకటించుకున్నారు. అయితే భారత్ దీనిని ఖండించింది. ఇది కూడా ట్రంప్ ఆగ్రహానికి కారణంగా ఆయన చూపాలరు. భారత్‌పై ట్రంప్ సుంకాల భారం మోపడానికి ప్రధానంగా రెండు కారణాలు కన్పిస్తున్నాయని తెలిపారు. బ్రిక్స్

## కేవలం రష్యాతో చమురు బేరం మాత్రే కాదు విశ్లేషకుల లోతైన అంచనా

కూటమిలో భారత్ కూడా సభ్యదేశంగా ఉంది. ఈ కూటమి అమెరికాకు వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకోవడంతో పాటు– డాలర్‌కు ప్రత్యామ్నాయ కరెన్సీని సృష్టించాలనే లక్ష్యంతో ఉందని ఆయన భావిస్తున్నారు. ఇది ఆయనకు నచ్చని అంశం. మరొకటి.. ఉద్రిక్తతల తర్వాత భారత్– పాక్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం జరిగింది. ఇది తానే చేశానని ట్రంప్ పదే పదే ప్రచారం చేసుకున్నారు. అయితే, కాల్పుల విరమణ చర్చల్లో మూడో దేశ ప్రమేయం లేదని భారత్ వాదిస్తోంది. దీనిపై ట్రంప్ అసంతృప్తిగా ఉన్నట్లు తెలుస్తోంది. పాక్ ట్రంప్ ప్రమేయాన్ని గుర్తించడంతో పాటు–.. నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలంటూ ప్రతిపాదనలు కూడా చేసింది. అమెరికాతో జరుగుతున్న వాణిజ్య చర్చల్లో భారత వైఖరిని కూడా పలువురు ప్రశంసించారు. వ్యవసాయం, పాడి పరిశ్రమలపై అమెరికా ఒత్తిళ్లకు లొంగకపోవడం సరైన చర్యేనని అంటున్నారు. ఇకపోతే రష్యా నుంచి చమురు కొనుగోలు చేయొద్దని ట్రంప్ హెచ్చరించినా భారత్ పట్టించుకోలేదు. దీంతో భారీగా సుంకాలు విధించారు. ఇప్పటికే విధించిన 25 శాతం సుంకాలను 50 శాతానికి పెంచారు. ఆ 25 శాతం అదనపు టారిఫ్‌లు ఈనెల 27 నుంచి అమల్లోకి రానున్నాయి. ఈ గడువుకు ముందే యూఎస్‌తో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవాలని న్యూఢిల్లీ చర్చలు జరుపుతోంది. అయితే ఇవేవీ నిలవవని, ఇది అమెరికాకు కూడా నష్టం కలిగించేదే అని అంటున్నారు.

# టీడీపీ వ్యూహంలోనే జగన్ ప్రయాణం



**కడప,తెలంగాణ దిశ:** పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికల బరి నుంచి తొలుత వైసీపీ తప్పుకుంటుందన్నప్రచారం జరిగింది.అయితే జగన్ మాత్రం వ్యూహాత్మకంగా వ్యవహరించారంటున్నారు.ఇప్పుడు జరిగే ఉప ఎన్నికల్లో టీడీపీ దౌర్జన్యాలు తెలిస్తే కడప ప్రజలు ఒకింత పార్టీపై సానుభూతి వ్యక్తం చేస్తారన్న అంచనాలు వినపడుతున్నాయి. గతంలోనూ కుప్పం నియోజకవర్గంలో ఇలాంటి చర్యలకే పాల్పడినందున ఆ ఎఫెక్ట్ చిత్తూరు జిల్లా మొత్తం వ్యాపించింది. నాటు వైసీపీ నేతలు చేసిన పనికి జిల్లా వ్యాప్తంగా టీడీపీకి పెద్దయెత్తున సానుభూతి కనిపించింది. ఒకరకంగా చెప్పాలంటే చిత్తూరు జిల్లామాత్రమే కాదు..చంద్రబాబు అరెస్ట్,కుప్పం నియోజకవర్గంలో వ్యవహరించిన తీరు రాష్ట్ర వ్యాప్తంగా 2024 ఎన్నికల్లో కనిపించింది.చిత్తూరు జిల్లాల్లో మొన్నటి ఎన్నికల్లో వైసీపీకి కేవలం రెండు సీట్లు మాత్రమే లభించాయి.మిగిలిన వన్నీ కూటమి ఖాతాలో పడ్డాయి. అలాగే కడప జిల్లాలో పదినియోజకవర్గాలుంటే మూడు అసెంబ్లీ సీట్లకే ఫ్యాన్ పార్టీ పరిమితమయింది. మిగిలిన ఏడు స్థానాలను కూటమి గెలుచుకుంది.ఇకరాయలసీమలోని కడప, కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో పెద్దగా ఫ్యాన్ పార్టీకి సీట్లు లభించలేదు. ఇందుకు ప్రధానంగా అనేక కారణాలున్నప్పటికీ ముఖ్యంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో తాడిపత్రి మినహా మిగిలిన చో?ట్ల నాడు అధికారంలో ఉన్న వైసీపీ గెలుచుకుంది. నాడు స్థానిక సంస్థల ఫలితాలో సంతృప్తి పడింది కానీ, తర్వాత జరిగిన ఎన్నికల్లో టీడీపీకి లాభించింది. ఇప్పుదు అదేరకమైన వ్యూహాన్ని వైఎస్ జగన్ కూడా అవలంబిస్తున్నారని పార్టీ నేతలు అంటున్నారు. బరి నుంచి తప్పుకుంటే తాము ఓటమికి భయపడి పోటీ నుంచి తప్పుకునట్లవుతుందని, అదే పోటీ చేస్తే వారు పోలీసులతో అధికార దుర్వినియోగానికి దిగడంతో పాటు ఓటర్లను అడ్డుకోవడంతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలను పోలింగ్ కేంద్రాల వద్ద మోహరించడంతో పాటు పోలింగ్ ఏజెంట్లను కూడా వైసీపీని అనుమతించకపోవడంతో భవిష్యత్ లో ఇది తమకు రాజకీయంగా లాభిస్తుందని అంచనా వేసి ఎన్నికల బరిలోకి జగన్ తన పార్టీ అభ్యర్థిని దించినట్లు తెలిసింది. మొత్తం మీద జగన్ వ్యూహం వచ్చే ఎన్నికల్లో ఏవిధమైన ఫలితాలు వస్తాయన్నది తెలియకున్నా, ఎంతో కొంత సానుభూతిమాత్రం వస్తుందని గట్టిగా నమ్ముతున్నారు.

# 225 చుట్టూ రాజకీయం..!

**విజయవాడ,తెలంగాణ దిశ:** రాష్ట్రంలో రాజకీయాలు కీలక మలుపులు తిరుగుతున్నాయి. కూటమి దూకుడు మీద ఉంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పూర్వ వైభవం దిశగా ప్రణాళికలు వేస్తోంది. మరోవైపు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతల అరెస్టుల పర్వం కొనసాగుతోంది. ముఖ్యంగా వైసీపీ హయాంలో భారీ ఎత్తున అవినీతి, కుంభకోణాలు జరిగాయని కూటమి ప్రభుత్వం చెబుతోంది. ఇంకోవైపు అవన్నీ రాజకీయ కక్షపూరిత కేసులని వైసీపీ చెప్పుకొస్తోంది. అయితే లోలోపల మాత్రం ఎవరికీ వారే పట్టుబిగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. 2029 ఎన్నికలను టార్గెట్ చేసుకున్నారు. ఎట్టి పరిస్థితుల్లో జగన్మోహన్ రెడ్డికి అవకాశం ఇవ్వకూడదని చంద్రబాబుతో పాటు పవన్ కళ్యాణ్ బలంగా నిర్ణయం తీసుకున్నారు. అయితే ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని చెబుతూ ప్రజల్లోకి వెళ్లేందుకు జగన్ నిర్ణయించుకున్నారు. దీంతో ఏపీలో రాజకీయం రోజుకో మలుపు తిరుగుతోంది. ఎత్తుకు పైఎత్తులు కొనసాగుతున్నాయి.అయితే వచ్చే ఎన్నికల నాటికి ఏపీవ్యాప్తంగా నియోజకవర్గాల సంఖ్య పెరుగుతుందని అంచనాలు ఉన్నాయి. ప్రస్తుతం ఏపీలో 175 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. నియోజకవర్గాల పెంపు విషయాన్ని ప్రస్తావించారు. ఏపీలో మరో 50 అసెంబ్లీ నియోజకవర్గాలు పెరుగుతాయని అంచనా వేశారు. తద్వారా అసెంబ్లీ నియోజకవర్గాల సంఖ్య 225కు చేరుకొనుంది. అయితే నియోజకవర్గాల పెంపును దృష్టిలో పెట్టుకొని ప్రధాన రాజకీయ పార్టీలు సరికొత్త వ్యూహంతో ముందుకు వెళుతున్నాయి. ఈ విషయంలో ఎవరి అంచనాలు వారికి ఉన్నాయి. అయితే నియోజకవర్గాల విభజనతో పాటు పెంపునకు సంబంధించి అధికార కూటమి మాట చెల్లుబాటు అయ్యే అవకాశం ఉంది. వారికి అనుకూలంగా నియోజకవర్గాల పునర్విభజన ఉండే అవకాశం ఉంటుంది. చివరిసారిగా 2009లో నియోజకవర్గాల పునర్విభజన సమయంలో అప్పటి కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా జరిగింది. ఇప్పుడు కూడా టిడిపి కూటమికి లాభం చేకూరే అవకాశం ఉంది.ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ బలమైన స్థితిలో ఉంది. 135 అసెంబ్లీ సీట్లలో ఆ పార్టీ విజయం సాధించింది. అయితే ఇంకా భవిష్యత్తు వ్యూహరచన లో భాగంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలను భారీగా ఆకర్షించగలిగింది. కేవలం నియోజకవర్గాల పునర్విభజన దృష్టిలో పెట్టుకొని వైసీపీలో ఉన్న బలమైన నేతలను టిడిపిలోకి రప్పించింది. అనివార్య కారణాలతో సిట్టింగ్ ఎమ్మెల్యేలను మారిస్తే ప్రత్యామ్నాయంగా కొంతమంది నేతలను సిద్ధం చేసుకుంది. నియోజకవర్గాల పెంపుతో లభించే స్థానాలకు ముందస్తుగానే నేతలను సంసిద్ధులను చేసింది తెలుగుదేశం పార్టీ. ఒకటి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని దెబ్బతీయడం.. రెండు భవిష్యత్తు అవసరాల దృష్ట్యా వైసీపీ నేతలను ఆకర్షించడం.. ఇలా ద్విముఖ వ్యూహంలో తెలుగుదేశం పార్టీ ఉంది.జనసేనకు సంబంధించి నియోజకవర్గాల పెంపు పై కూడా దృష్టి పెట్టింది. అందుకు అనుగుణంగా అడుగులు వేస్తోంది. మొన్నటి ఎన్నికల్లో సూపర్ విక్టరీ కొట్టింది జనసేన. 21 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేసి శతశాతం విజయం సాధించింది. వచ్చే ఎన్నికల నాటికి మరిన్ని సీట్లు పొందాలని చూస్తోంది. నియోజకవర్గాల పెంపులో భాగంగా.. పెరిగిన సీట్లలో మెజారిటీ స్థానాలను దక్కించుకోవాలన్న ఆలోచనలో ఉంది. ముఖ్యంగా రాష్ట్రంలోని మూడు ప్రాంతాల్లో పార్టీని విస్తరించాలని చూస్తోంది. అందుకే బలమైన నేతలను ముందుగా పార్టీలోకి రప్పించింది. నియోజకవర్గాల పెంపు పై ఒక అంచనాకు వస్తే మరింత మంది నేతలను పార్టీలోకి రప్పించేందుకు వ్యూహరచన చేస్తోంది. ముఖ్యంగా ఈసారి జనసేన రాయలసీమ జిల్లాలపై దృష్టి పెట్టే ఛాన్స్ కనిపిస్తోంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి భిన్నంగా ఆలోచన చేస్తున్నారు. ప్రభుత్వంపై వ్యతిరేకతతో ప్రజలు తమ వైపు చూస్తారని అంచనా వేస్తున్నారు. ఒకేసారి 50 నియోజకవర్గాల పెంపుతో తమకు కలిసి వస్తుందని ధీమాతో ఉన్నారు. పొత్తులో భాగంగా చాలామంది నేతలకు సీట్లు దక్కవని.. అటువంటి వారంతా వైసిపి వైపు చూడడం ఖాయమని భావిస్తున్నారు. ఇలా నియోజకవర్గాల పెంపు పై అన్ని పార్టీలు ఆశలు పెట్టుకున్నాయి. అయితే అసలు నియోజకవర్గాల పునర్విభజన ఉంటుందా? నియోజకవర్గాల పెంపు ఉంటుందా? అన్నదానిపై స్పష్టత లేదు.

# రవీంద్రనాథ్రెడ్డిపై టీటీడీ అధికారులు కేసు


**తిరుమల,తెలంగాణ దిశ:**కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత తిరుమలలో ప్రక్షాళన చేపట్టింది. వచ్చే భక్తులకు మాత్రమే కాదు, పవిత్రమైన తిరుమల కొండపై ఎవరైనా రాజకీయాలు ప్రసంగాలు చేస్తే కేసు నమోదు చేస్తామని టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు పదేపదే పలు ఇంటర్వ్యూల్లో చెప్పుకొచ్చారు. అయినా కొందరు వైసీపీ నేతల తీరు మారలేదు. రాజకీయాలను మాట్లాడేందుకు ప్రయత్నం చేస్తున్నారు.. చేశారు కూడా. తాజాగా ఆ లోవలోకి వచ్చారు జగన్ మేనమామ, వైసీపీ మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి. ఆదివారం ఉదయం వీఐపీ బ్రేక్ దర్శనంలో స్వామిని దర్శించుకున్న తర్వాత ఆయన మీడియాతో మాట్లాడారు. వైసీపీ హయాంలో నిత్యం నేతలు రాజకీయాలపై మాట్లాడేవారు. అక్కడ మాట్లాడితే తాము చెప్పాల్సిన మెసేజ్ సూటిగా ప్రజల్లోకి వెళ్తుందని కొందరు నేతల ఆలోచన. దీన్ని కూటమి ప్రభుత్వం ఏర్పడిన రాష్ట్రంలో వర్షాలు పడలేదని వ్యాఖ్యానించారు. అంతేకాదు సూపర్ సిక్స్ పేరుతో ప్రజలను మోసం చేశారని, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో జగన్ సీఎం కావాలని స్వామిని ప్రార్థించినట్టు చెప్పుకొచ్చారు. మరో అడుగు ముందుకేసిన ఆయన పులివెందుల, ఒంటిమిట్టల జెడ్పీటీసీ సీట్లు మంగళవారం జరగనున్న ఉప ఎన్నికల్లో వైసీపీ విజయం సాధిస్తుందని మనసులోని మాట బయటపెట్టారు. అంతేకాదు కూటమి పాలన, ఆయా రాజకీయ పార్టీలపై కామెంట్స్ సైతం చేశారు. శ్రీవారి ఆలయం ఎదుట మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను టీటీడీ విజిలెన్స్ విభాగం పరిశీలిస్తోంది. నిబంధనల ఉల్లంఘనపై ఆయనపై చర్యలు తీసుకునేందుకు సిద్ధమైంది. నేడో రేపో కేసు నమోదు చేస్తారా? రాజకీయ నాయకులకు ఇలాంటివి సహజమేనని టీటీడీ అధికారులు సైలెంట్‌గా అనేది ఇప్పుడు చర్చ. అయితే వైసీపీ మాత్రం రవీంద్రనాథ్‌రెడ్డి అండగా ఉంటుంది. ఆయన అన్నవిషయంలో ఎలాంటి తప్పులేదని అంటున్నారు. కావాలనే వైసీపీ నేతలపై కేసులు నమోదు చేయాలని భావిస్తోందని అంటున్నారు.

ఇదిలా ఉండగా గతంలో కొందరు వైసీపీ నేతలు చేసిన ఆగడాలు వెలుగులోకి వస్తున్నాయి. తిరుమలకు చెందిన వైసీపీ నాయకుడు భీమవరపు నాగరాజు రెడ్డి అలియాస్ మందల నాగరాజు రెడ్డి చేసిన అరాచకాలు వెలుగులోకి వస్తున్నాయి.

తిరుమలలో మద్యం బాటిల్‌తో ఉండడం, అసెంబ్లీ ఎన్నికల సమయంలో తిరుమలలో పోలింగ్ బూత్ వద్ద వైసీపీ అభ్యర్థికి అనుకూలంగా ప్రచారం చేసిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. దీనిపై తిరుమలకు చెందిన కొందరు అతనిపై జిల్లా పోలీసు కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. అతడి అరాచకాలపైనా తిరుమల టీటీడీ విజిలెన్స్ విభాగం పరిశీలన చేస్తోంది

# క్లౌడ్ బరస్ట్టల కాలం..!

వర్షాకాలం అంటే.. సీజన్ ఉన్నంత కాలం అప్పుడప్పుడూ వర్షాలు పడుతూ ఉంటాయి. నీటి కొరత లేకుండా చేస్తాయి. ఎప్పుడో ఓసారి తుపాన్లు వస్తాయి. కానీ ఇప్పుడు కాలం మారుతోంది. దానికి పర్యావరణంలో వస్తున్న మార్పుల కారణంగా అన్నీ ఎక్స్‌ట్రీమ్ అయిపోతున్నాయి. వర్షాలు కూడా ఒక్క సారే పడిపోతున్నాయి. దీనికి క్లౌడ్ బరస్ట్ అని పెరు పెట్టారు. ఇప్పుడు అసలు వర్షాలు పడటం కన్నా.. క్లౌడ్ బరస్టులే ఎక్కువగా జరుగుతున్నాయి. ఇటీవల హిమాచల్ ప్రదేశ్ లో క్లౌడ్ బరస్ట్ జరిగి ఓ గ్రామం తుడిచి పెట్టుకుపోయింది. నిన్నటికి నిన్న కశ్మీర్ లో అదే పరిస్థితి. పదుల సంఖ్యలో ప్రాణాలు పోతున్నాయి. అవన్నీ పర్వత ప్రాంతాల్లో ఉండే గ్రామాలు.. క్లౌడ్ బరస్ట్ ధాటికి కొండ చరియలు, బురద వచ్చి పడటంతో గ్రామాలు కొట్టుకుపోతున్నాయి. అదే క్లౌడ్ బరస్ట్ మైదాన ప్రాంతాల్లోనూ కామన్ గా మారుతున్నాయి. తెలుగు



రాష్ట్రాల్లోనూ పడుతున్న వర్షాలు.. సాధారణ వర్షాల్లా లేవు. క్లౌడ్ బరస్టల్లా పడుతున్నాయి. ఫలితంగా నీళ్లు ఎక్కడివక్కడే నిలిచిపోయేంతగా వర్షాలు పడుతున్నాయి. ఒక విషయం గమనిస్తే.. బాగా విపరీతంగా ఎండ వచ్చిన తర్వాత ఇలాంటి వర్షాలు పడుతున్నాయి. ఎందుకంటే గ్లోబల్ వార్మింగ్ వల్ల వాతావరణంలో ఆవిరి సామర్థ్యం పెరుగుతోంది. ఉష్ణోగ్రతలు పెరిగే కొద్దీ, వాతావరణం ఎక్కువ తేమను నిలుపుకోగలుగుతుంది, ఇది తీవ్రమైన వర్షపాత సంఘటనలకు దారితీస్తుందని చెబుతున్నారు. హిమాలయ ప్రాంతాలు, కొండ ప్రాం తాలు వంటి ప్రదేశాల్లో పర్వతాల వల్ల గాలి ఎగసిపడటం కారణంగా తేమతో కూడిన గాలి వేగంగా ఎగసి, దట్టమైన మేఘాలను ఏర్పరుస్తుంది, ఇవి క్లౌడ్ బరస్ట్‌లకు దారితీస్తున్నాయి. ఇతర ప్రాంతాల్లో రుతుపవ నాలు తీవ్రమైన తేమతో కూడిన గాలిని తీసుకొస్తున్నాయి. ఈ తేమ ఒకచోట చేరి, స్థానిక వాతావరణ పరిస్థితులతో కలిసి క్లౌడ్ బరస్ట్‌లకు కారణమవుతున్నాయి. అటవీ నిర్మూలన, పట్టణీకరణ, మ భూ వినియోగంలో మార్పులు స్థానిక వాతావరణ విధానాలను మారుస్తు న్నాయి. ఇవి క్లౌడ్ బరస్ట్‌ల లాంటి తీవ్రమైన సంఘటనలను పెంచుతు న్నాయి. జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఈ క్లౌడ్ బరస్టుల వల్ల జరిగే నష్టంపై ఇక మానవుడు దృష్టి పెట్టాల్సిన సమయం వచ్చింది.

# పొత్తుల లెక్కలు మారుతున్నాయా..



విశాఖపట్టణం,తెలంగాణ దిశ:ఏ రాజకీయ పార్టీల మధ్య అయినా పొత్తులు శాశ్వతం కాదు. లాభనష్టాలను వేసుకొని.. రాజకీయంగా కలిసివచ్చే అంశాలను పరిగణలోకి తీసుకొని మాత్రమే పొత్తులు కొనసాగు తాయి. తమ పార్టీకి.. పార్టీని నమ్ముకున్న నేతలకు న్యాయం జరిగితేనే ఆ పొత్తులకు అర్థం ఉంటుంది. అదే సమయంలో ఉమ్మడి శత్రువు బలంగా ఉన్నప్పుడు కూడా పొత్తు పదిలంగా ఉంటుంది. అయితే ఆ పొత్తు వల్ల ప్రయోజనాలు ఉంటేనే రాజకీయ పార్టీలు కలుస్తాయి. వికటిస్తాయంటే మాత్రం కఠిన నిర్ణయాలు తీసుకుంటాయి. అయితే ప్రస్తుతం ఏపీలో మూడు పార్టీల మధ్య గట్టి పొత్తు ఉంది. టిడిపి, జనసేన, బిజెపి పొత్తు కుదుర్చుకొని సూపర్ విక్టరీ సాధించాయి. అయితే వచ్చే ఎన్నికల నాటికి ఈ పొత్తు ఉంటుందా? అంటే మాత్రం ఉంటుంది అని ఆయా పార్టీలు చెబుతున్నాయి. కానీ ఒక్కోసారి పరిస్థితులు అనుకూలించకపోతే ఈ పొత్తులు విచ్ఛిన్నం కావడం ఖాయం. అయితే 2029 నాటి పరిస్థితులకు అనుగుణంగానే ఈ మూడు పార్టీల మధ్య పొత్తు కొనసాగే అవకాశం ఉంది.ఏపీలో స్థిరమైన ప్రభుత్వం కొనసాగుతుందని.. మరో 15 ఏళ్ల పాటు కూటమి ప్రభుత్వం ఉంటేనే ప్రజలకు మంచి పాలన అందించగ లమని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చెబుతున్నారు. ఎట్టి పరిస్థితుల్లో జగన్మోహన్ రెడ్డిని అధికారంలోకి రానివ్వనని హెచ్చరిస్తున్నారు. అయితే ఆయన సంకల్పంలో బలం ఉండవచ్చు కానీ.. పరిస్థితుల్లో మార్పులు వస్తే మాత్రం ఆయన నిర్ణయాలు మారి అవకాశం ఉంది. జనసేన శత శాతం విజయాన్ని సొంతం చేసుకుంది. 21 అసెంబ్లీ, రెండు పార్లమెంటు నియోజకవర్గం పోటీ చేసి అన్నిచోట్ల గెలుపొందింది. అయితే కేవలం 6% ఓటు బ్యాంకు ఉన్న జనసేన విజయం వెనుక తెలుగుదేశం పార్టీ ఓటు బ్యాంకు ఉందన్నది స్పష్టం. అయితే 100 స్ట్రైక్ రేటుతో జనసేనలో ఆత్మవిశ్వాసం పెరిగింది. అయితే అదంతా మా బలంతోనే నన్న వాదన టిడిపి నుంచి ఉంది. అయితే ఆ రెండు పక్షాల మధ్య వాదన పెరిగితే మాత్రం వివాదాలు చెలరేగే అవకాశం ఉంది.ఎవరు లేదన్నా.. తెలుగుదేశం పార్టీపై స్పష్టమైన పట్టు సాధించారు నారా లోకేష్. పూర్తిస్థాయిలో పట్టు బిగించారు కూడా. ఆయన చుట్టూ యువ బృందం పెరిగింది. భవిష్యత్తు వ్యూహరచనలో ఆ టీం ఉంది. తప్పకుండా వచ్చే ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డి మాదిరిగా ఒంటరిగా బరిలో దిగుదామని ఒక వాదనను తెరపైకి ఎత్తిస్తోంది ఆ యువ టీం. టిడిపి బలమైన పార్టీ అని.. క్షేత్రస్థాయిలో మంచి బలం ఉందని.. 2024 ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసినా విజయం సాధించి ఉండేదని నమ్మకంగా చెబుతోంది ఆ యువ బృందం. ఒకవేళ ఎన్నికల ముంగిట అదే నమ్మకం పెరిగితే మాత్రం అకస్మాత్తుగా టిడిపి ఒంటరి పోరుకు దిగే అవకాశం ఉంది.ప్రస్తుతం జాతీయస్థాయిలో బిజెపి ప్రత్యర్థి పార్టీలు దూకుడు పెంచుతున్నాయి. కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ నాయకత్వానికి ఇప్పుడిప్పుడే మద్దతు పెరుగుతోంది. అయితే రాహుల్ గాంధీ ప్రభావం పెరిగితే మాత్రం.. మోదీ హవా తగ్గే అవకాశం ఉంది. తప్పకుండా అప్పుడు చంద్రబాబు పునరాలో చనలో పడతారు. చంద్రబాబు బిజెపితో పొత్తు రికార్డు చూస్తే ఒక్కోసారి ఒక్కోలా ఉంటుంది. 1999లో బిజెపితో పొత్తు పెట్టుకుని గెలిచారు. 2004లో పొత్తు పెట్టుకున్నా ఓడిపోయారు. 2014లో మరోసారి పొత్తు పెట్టుకుని అధికారంలోకి వచ్చారు. 2019లో పొత్తు కుదుర్చుకోలేదు. 2024లో మాత్రం పొత్తు పెట్టుకుని అధికారంలోకి వచ్చారు. బిజెపి విషయంలో ఒక్కటి నిజం. ఆ పార్టీ బలంగా ఉన్నప్పుడు పొత్తు పెట్టుకుంటేనే ఫలితముంటుంది. లేకుంటే ఆ పార్టీపై ఉన్న వ్యతిరేకత సైతం పనిచేస్తుంది. జాతీయస్థాయిలో బిజెపి పై వ్యతిరేకత ప్రారంభం అయితే.. యాంటీ సెంటిమెంట్ నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. తద్వారా వంటరి పోరాటానికి చంద్రబాబు జై కొట్టే అవకాశం ఉందిఒక్కోసారి పొత్తు అనేది వికటిస్తుంది. సీట్ల సర్దుబాటు తో పాటు నేతలందరినీ సంతృప్తి పరచకపోతే ఇబ్బందికర పరిస్థితులు వస్తాయి. 2029 నాటికి నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుంది. మరో 50 సీట్లు అదనంగా పెరుగుతాయి. 225 స్థానాలు ఉంటాయి. అటువంటి ప్పుడు కచ్చితంగా జనసేన 50 అసెంబ్లీ సీట్ల వరకు డిమాండ్ చేస్తుంది. బిజెపి సైతం తమ ప్రాతినిధ్యం పెంచుకోవాలని చూస్తుంది. అయితే ఆ రెండు పార్టీలకు సీట్లు కేటాయిస్తే టిడిపిలో ఆశావాహులు నిరాశకు గురి కావడం ఖాయం. పోనీ జనసేనకు సీట్లు తగ్గించి ఇస్తే.. ఆ పార్టీలో టికెట్ల కోసం చేరిన వైసీపీ నేతల పరిస్థితి ఏంటి? అంటే కలిసి ఉండి ఇబ్బంది పడడం కంటే.. వేరువేరుగా పోటీ చేసి.. గెలిచిన తర్వాత పొత్తు పెట్టుకుందామన్న ప్రతిపాదన కూడా వచ్చే అవకాశం ఉంది. అయితే ఎన్నికలకు ఇంకా సమయం ఉంది.

## అనంతుల లక్ష్మీనారాయణకి ఉత్తమ సేవా పురస్కారం

**చుంచుపల్లి,తెలంగాణ దిశ:**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండల కేంద్రంలో గల సివిల్ సప్లైస్ కార్పొరేషన్ విభాగంలో గ్రేడ్ వన్ మేనేజర్‌గా పాల్వంచ ఎల్పీజీ సెంటర్‌లో విధులు నిర్వహిస్తున్న అనంతుల లక్ష్మీనారాయణ ఉత్తమ సేవా పురస్కరం అందుకున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రగతి మైదానం గ్రౌండ్స్ లో శుక్రవారం జరిగిన 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ జితేశ్ వి పాటిల్ చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును అందుకున్నారు.

# మీరు రోజూ తాగే టీ, కాఫీలలో వీటిని కలిపి తాగండి..




రోజూ చాలా మంది ఉదయం నిద్ర లేచినప్పటి నుంచి మళ్లీ రాత్రి నిద్రించే వరకు కూడా టీ లేదా కాఫీలను తెగ తాగేస్తుంటారు. అయితే టీ, కాఫీలను మోతాదులో తాగితే ఆరోగ్యకరమే అయినప్పటికీ వీటిని మరీ అతిగా సేవిస్తే మాత్రం ఆరోగ్యానికి హాని జరుగుతుంది. టీ, కాఫీలను అతిగా సేవించడం వల్ల అనేక అనర్థాలు సంభవిస్తాయి. అయితే ఇలా జరగకుండా టీ, కాఫీలను తాగాలంటే మీరు రోజూ తాగే వాటిలో పలు మసాలా దినుసులను కలుపుకోవాలి. ఇవి మన వంట ఇంట్లోనే ఉంటాయి. మనకు ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. మీరు రోజూ తాగే టీ లేదా కాఫీలలో ఈ మసాలా పదార్థాలను కలిపి తాగితే రుచికి రుచి లభించడంతోపాటు ఆరోగ్య ప్రయోజనాలను కూడా పొందవచ్చు. ఈ మసాలా పదార్థాలను టీ లేదా కాఫీలలో కలపడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు. ఆరోగ్యంగా కూడా సరిగ్గా ఉంటుంది.

అల్లం, దాల్చిన చెక్క..: మీరు రోజూ తాగే టీ లేదా కాఫీలో అల్లం కలిపి తాగండి. అల్లాన్ని వేసి అవి తయారు చేసి తాగండి. అల్లంలో యాంటీ మైక్రోబియల్, యాంటీ ఇన్ ఫ్లామేటరీ లక్షణాలు ఉంటాయి. ఇవి రోగాల నుంచి మనల్ని రక్షిస్తాయి. ముఖ్యంగా అల్లంలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. దీని వల్ల శరీరం ఇన్ఫెక్షన్లు, వ్యాధులకు వ్యతిరేకంగా పోరాడుతుంది. సీజనల్ వ్యాధుల నుంచి ఉపశమనం లభిస్తుంది. దాల్చిన చెక్కను కూడా టీ, కాఫీలలో కలిపి సేవించవచ్చు. దీన్ని మరిగించాల్సిన పనిలేదు. కాస్త పొడి వేసుకుని కలిపి తాగినా చాలు, ప్రయోజనం ఉంటుంది. దాల్చిన చెక్కలోనూ యాంటీ ఆక్సిడెంట్లు అధికంగానే ఉంటాయి. ఇవి రోగ నిరోధక వ్యవస్థ పనితీరును మెరుగు పరుస్తాయి. దీంతో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. దాల్చిన చెక్కలో యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు కూడా ఉంటాయి. ఇవి నొప్పులు, వాపులను తగ్గిస్తాయి. కనుక ఆర్థరైటిస్ నొప్పులు ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది.

పుదీనా ఆకులు..: పుదీనా ఆకులను కూడా టీ లేదా కాఫీలో వేసి మరిగించి తాగవచ్చు. పుదీనా ఆకుల్లో మెంథాల్ ఉంటుంది. ఇది రోగ నిరోధక వ్యవస్థకు దోహదం చేస్తుంది. వ్యాధులు రాకుండా మనల్ని రక్షిస్తుంది. పుదీనాను తీసుకుంటే జీర్ణక్రియ సైతం మెరుగు పడుతుంది. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. అజీర్తి, గ్యాస్, కడుపు ఉబ్బరం నుంచి ఉపశమనంలభిస్తుంది. ఆయుర్వేద పరంగా తులసికి ఎంతో ప్రాధాన్యత ఉంది. తులసి ఆకుల్లో మన రోగ నిరోధక శక్తిని పెంచే గుణాలు ఉంటాయి. కనుక టీ లేదా కాఫీలో తులసి ఆకులను వేసి మరిగించి తాగవచ్చు. ఈ పానీయాలను సేవిస్తే రోగ నిరోధక శక్తి పెరిగి వ్యాధులు రాకుండా ఉంటాయి. అలాగే గులాబీ పువ్వుల రెక్కలతోనూ టీ, కాఫీ తయారు చేసి తాగవచ్చు. వీటిల్లో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. వ్యాధులు రాకుండా చూస్తాయి.

యాలకులు..: యాలకులతోనూ టీ లేదా కాఫీ తయారు చేసి తాగవచ్చు. ఈ పానీయాలు ఇలా చేస్తే ఎంతో రుచిగా ఉండడమే కాదు, ఆరోగ్య ప్రయోజనాలను కూడా అందిస్తాయి. యాలకుల్లో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. వ్యాధులు రాకుండా రక్షిస్తాయి. అలాగే సోంపు గింజలను కూడా టీ లేదా కాఫీలో వేసి మరిగించి తీసుకోవచ్చు. వీటిల్లో యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు ఉంటాయి. ఇవి జీర్ణశక్తిని మెరుగు పరుస్తాయి. రోగ నిరోధక వ్యవస్థను పటిష్టంగా మారుస్తాయి. దీంతో ఇమ్యూనిటీ పెరుగుతుంది. రోగాల నుంచి రక్షణ లభిస్తుంది. ఇలా పలు రకాల మసాలా పదార్థాలను మీరు రోజూ తాగే టీ, కాఫీలలో వేసి మరిగించి తీసుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. రోగాల నుంచి రక్షణ లభిస్తుంది. రోగ నిరోధక శక్తి సైతం పెరుగుతుంది.



# పురుషుల్లో శృంగార సామర్థ్యాన్ని పెంచే ఔషధం ఇది..

అరటి పండ్లు అంటే చాలా మందికి ఇష్టమే. ఈ పండ్లు మనకు ఏడాది పొడవునా అన్ని సీజన్లలోనూ అందుబాటులో ఉంటాయి. ఈ పండ్లను చాలా మంది ఇష్టంగా తింటారు. ధర కూడా తక్కువగానే ఉంటుంది. అరటి పండ్లలోనూ అనేక వెరైటీలు ఉంటాయి. అయితే కేవలం అరటి పండ్లే కాదు.. అరటి పువ్వు కూడా మనకు ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. అరటి పువ్వును కొందరు కూరగా వండుకుని తింటుంటారు. ఇది ఎంతో రుచిగా ఉంటుంది. అరటి పువ్వులో మన శరీరానికి కావల్సిన అనేక పోషకాలు ఉంటాయి. అరటి పువ్వును ఆహారంలో భాగం చేసుకుంటే అనేక ప్రయోజనాలను పొందవచ్చని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. అరటి పువ్వులో విటమిన్లు ఎ, సి, ఇ ఉంటాయి. పొటాషియం, క్యాల్షియం, మెగ్నిషియం, ఐరన్, జింక్ సమృద్ధిగా ఉంటాయి.

కంటి చూపు సమస్యకు..: అరటి పువ్వులో ఉండే విటమిన్ ఎ కంటి చూపును మెరుగు పరుస్తుంది. కళ్ల సమస్యలను తగ్గిస్తుంది. కళ్లలో శుక్లాలు రాకుండా చూస్తుంది. అలాగే రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. శరీరం వ్యాధులు, ఇన్‌ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాడుతుంది. చర్మాన్ని సంరక్షిస్తుంది. అరటి పువ్వులో ఉండే విటమిన్ సి రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. ఇన్‌ఫెక్షన్లు రాకుండా చూస్తుంది. ఈ పువ్వులో ఉండే విటమిన్ ఇ చర్మాన్ని రక్షిస్తుంది. చర్మంపై ఉండే ముడతలు, మచ్చలు పోతాయి. ముఖం కాంతివంతంగా మారి మెరుస్తుంది. యవ్వనంగా కనిపిస్తారు. అరటి పువ్వులోని విటమిన్ ఇ పురుషులకు ఎంతో మేలు చేస్తుంది. తరచూ అరటి పువ్వును తింటే పురుషుల్లో శృంగార సామర్థ్యం పెరుగుతుంది. శృంగారంలో చురుగ్గా పాల్గొంటారు. ఒత్తిడి, ఆందోళన, నీరసం, అలసట తగ్గుతాయి.

ఎముకల ఆరోగ్యానికి..: అరటి పండు కన్నా అరటి పువ్వులోనే పొటాషియం అధిక మొత్తంలో ఉంటుంది. ఇది రక్త సరఫరాను మెరుగు పరుస్తుంది. రక్త ప్రసరణ సరిగ్గా అయ్యేలా చేస్తుంది. దీంతో బీపీ తగ్గుతుంది. హైబీపీ నియంత్రణలో ఉంటుంది. బీపీ ఉన్నవారు తరచూ అరటి పువ్వును తింటుంటే ఎంతో మేలు జరుగుతుంది. అరటి పువ్వులో ఉండే క్యాల్షియం ఎముకలు, దంతాలను దృఢంగా, ఆరోగ్యంగా ఉంచుతుంది. ఈ పువ్వులోని మెగ్నిషియం కండరాల పనితీరుకు సహకరిస్తుంది. కండరాల నొప్పుల నుంచి ఉపశమనాన్ని అందిస్తుంది. రాత్రి పూట కాలి పిక్కలు పట్టుకుపోయే సమస్య ఉన్నవారు తరచూ అరటి పువ్వును తింటే మేలు జరుగుతుంది. అరటి పువ్వులో ఉండే ఐరన్ రక్తం తయారయ్యేలా చేస్తుంది. దీంతో రక్తహీనత తగ్గుతుంది. ఈ పువ్వులోని జింక్ రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. శిరోజాలు, గోర్లకు సంరక్షణను అందిస్తుంది.

జీర్ణ వ్యవస్థకు..: అరటి పువ్వులో క్వర్సెటిన్, కాటెకిన్ అనే యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి ఫ్రీ ర్యాడికల్స్ వల్ల శరీరానికి కలిగే నష్టాన్ని నివారిస్తాయి. దీంతో క్యాన్సర్, గుండె పోటు వంటి ప్రాణాంతక వ్యాధులురాకుండా అడ్డుకోవచ్చు. అరటి పువ్వులో ఉండే ఫైబర్ జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. అరటి పువ్వును తరచూ తింటే జీర్ణ క్రియ మెరుగు పడుతుంది. మలబద్దకం తగ్గుతుంది. ఈ పువ్వులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు షుగర్‌లెవల్స్‌నతగ్గిస్తాయి. టైప్ 2 డయా బెటిస్ ఉన్నవారు తరచూ ఈ పువ్వును కూరగా వండుకుని తింటే ఎంతో మేలు జరుగుతుంది. దీంతో డయాబెటిస్ నియంత్రణలో ఉం టుంది. అధిక కొలెస్ట్రాల్ ఉన్నవారికి కూడా ఈ పువ్వు ఎంతో మేలు చేస్తుంది. దీంతో రక్త నాళాల్లో ఉండేఅడ్డంకులుతొలగిపోతాయి. గుండె ఆరోగ్యంగా ఉంటుంది. ఇలాఅరటి పువ్వుతోఅనేకలాభాలను పొందవచ్చు.

# వేసవిలో రోజూ తేనెను తింటే ఎన్ని లాభాలు కలుగుతాయో తెలుసా..?



అన్ని కాలాల్లాగే వేసవి కాలంలోనూ మనకు అనేక అనారోగ్య సమస్యలు వస్తుంటాయి. కారం, మసాలాలు అధికంగా ఉండే ఆహారాలను తినకూడదు. ఒక వేళ తింటే జీర్ణ సమస్యలు తలెత్తుతాయి. ముఖ్యంగా అసిడిటీ, కడుపులో మంట వస్తుంటాయి. ఇవే కాకుండా పలు ఇతర అనారోగ్య సమస్యలు కూడా మనకు వేసవిలోవస్తుంటాయి. అందువల్ల ఈ సీజన్‌కు తగినట్లుగా మనం ఆహారాలను తింటూ ఉండాలి. మనం తినే ఆహారాలు మన ఆరోగ్యాన్ని పరిరక్షించేవి కూడా అయి ఉండాలి. దీంతో ఓవైపు అనారోగ్య సమస్యలను తప్పించుకుంటూనే మరోవైపు పోషకాలను కూడా పొందవచ్చు. ఇక వేసవిలో తీసుకోవాల్సిన ఆహారాల్లో తేనె కూడా ఒకటి. వేసవిలో మన శరీరం సహజంగానే వేడికి గురవుతుంది. దీని బారి నుంచి తప్పించేందుకే కాక ఈ సీజన్‌లో తేనెను తీసుకోవడం వల్ల మనం అనేక ప్రయోజనాలను పొందవచ్చు.

చర్మ సంరక్షణ..: వేసవి కాలంలో రోజూ తేనెను ఒక టీస్పూన్ మోతాదులో తీసుకుంటే అనేక లాభాలను పొందవచ్చు. తేనె మన శరీరాన్ని చల్లబరుస్తుంది. ఒక గ్లాస్ నీటిలో కాస్త తేనె కలిపి తాగితే శరీరంలోని వేడి బయటకు పోయి శరీరం చల్లగా మారుతుంది. వేసవి తాపం నుంచి ఉపశమనం లభిస్తుంది. ఎండ దెబ్బ తగలకుండా జాగ్రత్త పడవచ్చు. డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉంటారు. ఉదయం ఈ నీళ్లను సేవిస్తే రోజంతా యాక్టివ్‌గా ఉంటారు. ఉత్సాహంగా పనిచేస్తారు. ఎంత పనిచేసినా అలసట రాదు. నీరసం కూడా ఉండదు. ఇక ఈ సీజన్‌లో మన శరీరం పొడిబారిపోతుంది. కొందరికి చర్మం ఈ సీజన్‌లోనే పగులుతుంది. అలాంటి వారు తేనెను తీసుకుంటే ఉపశమనం లభిస్తుంది. తేనె చర్మానికి సహజసిద్ధమైన మాయిశ్చరైజర్‌లా పనిచేస్తుంది. దీంతో చర్మం ఎల్లప్పుడూ తేమగా ఉంటుంది. పొడిబారదు, పగలదు. తేనెతో ఫేస్ ప్యాక్‌లు కూడా వేసుకోవచ్చు. దీంతో ముఖం కాంతివంతంగా మారి యవ్వనంగా కనిపిస్తుంది. ముడతలు, మచ్చలు తగ్గిపోతాయి.

నిద్రలేమి..: రాత్రి పూట మీకు నిద్ర సరిగ్గా పట్టడం లేదా.. అయితే తేనెను తీసుకుంటూ ఉంటే ఈ సమస్య నుంచి బయట పడవచ్చు. తేనెలో ట్రిప్టోఫాన్ అనే అమైనో యాసిడ్ ఉంటుంది. అందువల్ల తేనెను తీసుకుంటే ఇది మన శరీరంలో సెరొటోనిన్, మెలటోనిన్‌గా మారుతుంది. ఇది నిద్రను ప్రోత్సహించే హార్మోన్. కనుక రాత్రి పూట తేనెను తీసుకుంటే మైండ్ రిలాక్స్ అయి చక్కగా నిద్ర వస్తుంది. పడుకున్న వెంటనే గాఢ నిద్రలోకి జారుకుంటారు. తేనెలో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్ గుణాలు ఉంటాయి. అందువల్ల తేనె మనల్ని బ్యాక్టీరియా, వైరస్‌ల నుంచి రక్షిస్తుంది. రోగ నిరోధక వ్యవస్థను పటిష్టంగా మారుస్తుంది. దీంతో శరీరం వ్యాధులకు వ్యతిరేకంగా పోరాడుతుంది. ఇన్ఫెక్షన్లు తగ్గేలా చేస్తుంది.

అధిక బరువుకు..: తేనెలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి శరీరాన్ని వాపులు, నొప్పుల నుంచి రక్షిస్తాయి. చర్మ కణాలు డ్యామేజ్ అవకుండా చూస్తాయి. దీంతో సూర్యుని నుంచి వచ్చే అతినీలలోహిత కిరణాల బారి నుంచి రక్షణ లభిస్తుంది. తేనె వల్ల శరీరం హైడ్రేటెడ్‌గా మారుతుంది. కోల్పోయిన ద్రవాను తిరిగి పొందుతుంది. వేసవిలో ఇది ఎంతో మేలు చేస్తుంది. శరీరం డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉంటుంది. ఎండ దెబ్బ తగలదు. అలాగే అధిక బరువును తగ్గించడంలోనూ తేనె అద్భుతంగా పనిచేస్తుంది. రోజూ ఉదయం పరగడుపునే గోరు వెచ్చని నీటిని ఒక గ్లాస్ తీసుకుని అందులో రాస్త తేనె వేసి కలిపి తాగుతుంటే శరీరంలోని కొవ్వు కరుగుతుంది. అధిక బరువు తగ్గుతారు. గొంతు సమస్యలు ఉన్నవారు తరచూ తేనెను తీసుకుంటుంటే సమస్య నుంచి ఉపశమనం లభిస్తుంది. ఇలా వేసవిలో తేనెను రోజూ తీసుకోవడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు.

# తక్షణ శక్తికి చెరకు రసం



కూల్‌డ్రింక్స్‌కి బదులు చెరకు రసం తాగితే ఎంతో మేలు. చెరకు రసం అలసట, నిస్సత్తువను తగ్గించి తక్షణ శక్తిని అందిస్తుంది. చెరకులో పిండిపదార్థాలు, ఫైబర్, పొటాషియం, జింక్, ఫాస్ఫరస్, క్యాల్షియం, ఐరన్ లాంటి మినరల్స్ పుష్కలంగా ఉంటాయి. విటమిన్-ఎ, బి, సి కూడా మెండుగా ఉంటాయి.

దీంతో చెరుకు రసం క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల శరీరంలో ప్రొటీన్ స్థాయిలు పెరుగుతాయి. %-% మూత్రపిండాల ఆరోగ్యానికి కూడా మంచిది. అలాగే క్రమం తప్పకుండా చెరకు రసం తాగితే రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఇందులోని ఫ్లేవనాయిడ్స్, యాంటీఆక్సిడెంట్లు, ఇతర ఫెనోలిక్ కాంపౌడ్స్ వృద్ధాప్య ఛాయలు రాకుండా అడ్డుకుంటాయి.

చెరకు రసం కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించి గుండె ఆరోగ్యాన్ని కాపాడుతుంది.

ఎక్కువ వద్దు: అయితే కొంతమంది చెరకురసం ఆరోగ్యానికి మేలు చేస్తుందని.. ఎక్కువగా తాగుతారు. ఒకేసారి రెండు గ్లాసుల కంటే ఎక్కువ చెరకు రసం తాగితే.. ఆరోగ్యానికి హాని జరిగే ప్రమాదం ఉంది. చెరకు రసం అధికంగా తీసుకోవడం వల్ల విరేచనాలు, మలబద్ధకం, డయాబెటిస్ వచ్చే ప్రమాదం ఉంది. అలాగే 20 నిమిషాల కంటే ఎక్కువసేపు నిల్వ ఉంచింది తాగకూడదు. ఒకవేళ తాగితే శరీరానికి మంచిది కాదు. నిల్వ ఉన్న చెరుకురసం ఆక్సీకరణ చెంది, కడుపు నొప్పి, వాంతులు, కళ్లు తిరగడం వంటి సమస్యలకు కారణమవుతుంది. కాబట్టి తాజాగా చేసిన చెరకు రసం తాగడం మంచిది. చెరకు రసంలో పొలికోసనాల్ అధికంగా ఉంటాయి. పొలికోసనాల్ అధికంగా ఉండటం వల్ల నిద్రలేమి సమస్య వచ్చే అవకాశం ఉంది. ఈ సమస్య ముదిరితే..

మానసిక సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది. చెరకు రసంలో కేలరీలు, చక్కెర పుష్కలంగా ఉంటాయి. ఇవి ఎక్కువగా తీసుకుంటే బరువు త్వరగా పెరుగుతారు. బరువును అదుపులో ఉంచుకోవాలంటే.. రోజుకు ఒక గ్లాసు చెరకు రసం మాత్రమే తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. చెరకులో ఉండే పోలికోసనాల్ రక్తాన్ని పలుచగా చేస్తాయి. దీని వల్ల రక్తం గడ్డకట్టదు.

# రోజూ కొబ్బరినూనెను తీసుకుంటే ఇన్ని లాభాలు ఉన్నాయా..?

కొబ్బరినూనెను చాలా మంది జుట్టు సంరక్షణ కోసం ఉపయోగిస్తుం టారు. కొబ్బరినూనె శిరోజాలకు ఎంతో మేలు చేస్తుంది. కొబ్బరినూ నెను రాయడం వల్ల జుట్టు మృదువుగా మారుతుంది. కాంతివంతంగా తయారవుతుంది. శిరోజాలు సహజసిద్ధమైన నిగారింపును సొంతం చేసుకుంటాయి. చుండ్రు తగ్గుతుంది. జుట్టు చివర్లు చిట్లిపోవడం నుంచి బయట పడవచ్చు. శిరోజాలకు చక్కని పోషణ లభించి ఒత్తుగా, దృఢంగా పెరుగుతాయి. అయితే వాస్తవానికి కొబ్బరినూనె మనకు కేవలం శిరోజాల సంరక్షణకే కాదు, పలు ఇతర ఆరోగ్య ప్రయోజనా లకు కూడా పనిచేస్తుంది. కొన్ని ప్రాంతాల వాసులు కొబ్బరినూనెను సేవిస్తుంటారు. కొబ్బరినూనెలో అనేక ఔషధ గుణాలు ఉంటాయి. కొబ్బరినూనెను ఆహారంలో భాగం చేసుకుంటే అనేక పోషకాలను పొందవచ్చు. పలు వ్యాధుల నుంచి బయట పడవచ్చు. అన్ని రకాల చర్మ సమస్యలకు..: బాగా పండిన కొబ్బరి నుంచి నూనెను తీస్తారు. కొబ్బరికాయలు వాస్తవంగా చెప్పాలంటే పండ్ల జాతికి చెందుతాయి. కొబ్బరి నూనె చర్మాన్ని సహజసిద్ధంగా తేమగా మారుస్తుంది. మీరు రోజూ తినే ఆహారంలో ఒక టీస్పూన్ కొబ్బరినూ నెను చేర్చుకుంటే అనేక లాభాలు కలుగుతాయి. కోల్డ్ ప్రెస్డ్ విధానంలో తయారు చేసిన కొబ్బరినూనెలో పోషకాలు అధికంగా ఉంటాయి. రిఫైన్ చేయబడిన కొబ్బరినూనెను ఉపయోగించకూడదు. కొబ్బరినూనెలో యాంటీ ఆక్సిడెంట్లు, పాలిఫినాల్స్, విటమిన్ ఇ అధికంగా ఉంటాయి. ఈ నూనెలో మీడియం చెయిన్ ఫ్యాటీ యాసిడ్స్ ఉంటాయి. కొబ్బరినూనె యాంటీ ఇన్ ఫ్లామేటరీ, యాంటీ మైక్రోబియల్, యాంటీ ఫంగల్ గుణాలను కలిగి ఉంటుంది. అందువల్ల కొబ్బరినూనెను వాడితే అన్ని రకాల చర్మ సమస్యలు తగ్గుతాయి.

పోషకాలు అధికం..: శిరోజాల సంరక్షణకు కొబ్బరినూనె ఎంతో ఉపయోగపడుతుంది. కొబ్బరినూనెను వాడితే జుట్టుకు కలిగే నష్టాన్ని నివారించవచ్చు. దంతాలు, చిగుళ్ల సంరక్షణకు కూడా కొబ్బరినూనె పనిచేస్తుంది. 1 టేబుల్ స్పూన్ (11 గ్రాములు) కొబ్బరినూనె ద్వారా సుమారుగా 99 క్యాలరీల శక్తి లభిస్తుంది. 11 గ్రాములు కొవ్వు, 9.5



గ్రాముల శాచురేటెడ్ కొవ్వులు, 0.7 గ్రాముల మోనో అన్‌శాచు రేటెడ్ కొవ్వులు, 0.2 గ్రాముల పాలీ అన్‌శాచురేటెడ్ కొవ్వులు లభిస్తాయి. కొబ్బరినూనెలో ఉండే మీడియం చెయిన్ ఫ్యాటీ యాసిడ్లు యాంటీ ఇన్ ఫ్లామేటరీ, యాంటీ మైక్రోబియల్, యాంటీ ఫంగల్ గుణాలను కలిగి ఉంటాయి. అందువల్ల గజ్జి, తామర, సోరియాసిస్ వంటి చర్మ సమస్యలకు కొబ్బరినూనె అద్భుతంగా పనిచేస్తుంది.

గుండె ఆరోగ్యానికి..: రోజూ రాత్రి పూట నిద్రకు ముందు ఒక టీస్పూన్ కొబ్బరినూనెను సేవిస్తుండాలి. ఇది సహజసిద్ధమైన లాక్సేటివ్‌గా పనిచేస్తుంది. దీంతో మరుసటి రోజు సుఖ విరేచనం అవుతుంది. జీర్ణాశయంలో ఉండే వ్యర్థాలు, టాక్సిన్లు సులభంగా బయటకు పోతాయి. పెద్ద పేగు శుభ్రంగా మారుతుంది. మలబద్దకం తగ్గుతుంది. అలాగే కొబ్బరినూనెను తీసుకోవడం వల్ల జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. జీర్ణక్రియ సాఫీగా సాగుతుంది. గ్యాస్, కడుపు ఉబ్బరం, అసిడిటీ, అజీర్తి ఉండవు. కొబ్బరినూనెలో ఉండే అన్ శాచురేటెడ్ కొవ్వులు కొలెస్ట్రాల్‌ను తగ్గించేందుకు పనిచేస్తాయి.

 Volume : 3 Issue No. 103 తెలంగాణ దిశ Saturday,October,11,2025 శనివారం,అక్టోబర్,11,2025

# ఒకే కుటుంబంలో ఐదుగురికి ఇందిరమ్మ ఇళ్లు?



**ఖమ్మం,తెలంగాణ దిశ:** తెలంగాణ ప్రభుత్వం పేదల కోసం ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు కోసం అధికారులు ఎంత కఠిన చర్యలు తీసుకుంటున్నా.. అక్కడక్కడ అవకతవకలు వెలుగు చూస్తూనే ఉన్నాయి. తాజాగా ఖమ్మం జిల్లాలో ఒకే కుటుంబానికి ఐదు ఇళ్లు మంజూరు కావడం వివాదాస్పదమైంది. దీనిపై స్థానికులు ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో కూడా అనర్హులకు ఇళ్లు మంజూరు కావడంతో 1950 ఇళ్లను అధికారులు రద్దు చేసిన సంగతి తెలిసిందే.తెలంగాణ ప్రభుత్వం పేదల సొంతింటి కల సాకారం కోసం ఇందిరమ్మ ఇళ్లు పథకాన్ని ప్రారంభించిన సంగతి తెలిసిందే. తొలి విడతలో భాగంగా ప్రతి నియోజకవర్గం నుంచి 3,500 మంది అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లను కేటాయించారు. ప్రస్తుతం ఈ ఇళ్లన్నీ నిర్మాణ దశలో ఉన్నాయి. వీలైనంత వరకు పెద్ద సంఖ్యలో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి.. ఆగస్టు 15 నాటికి పెద్ద ఎత్తున గృహప్రవేశం కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియలో అధికారులు చాలా అప్రమత్తంగా ఉంటున్నారు. 360 డిగ్రీలో అభ్యర్థుల వివరాలను పూర్తి స్థాయిలో పరిశీలించిన తర్వాతే.. అర్హులుగా తేలిన వారిని ఎంపిక చేసి వారికి ఇళ్లు కేటాయిస్తున్నారు. అయితే అధికారులు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా కొన్ని చోట్ల అనర్హులకు ఇళ్లు మంజూరవుతున్నాయి. తాజాగా ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ఓ వార్త సంచలనంగా మారింది. ఒకే కుటుంబంలో ఐదుగురికి ఇందిరమ్మ ఇళ్లు కేటాయించారనే వార్తపై పెద్ద ఎత్తున ఆందోళన వ్యక్తం అవుతోంది. ఆ వివరాలు..ఖమ్మం జిల్లాలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారనే వార్త సంచలనంగా మారింది. ఖమ్మం 8వ డివిజన్ వైఎస్సార్ నగర్ కాలనీలో నివాసం ఉంటున్న ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురికి ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ తొలి విడతలో ఇళ్లు మంజూరైనట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. దీనిపై స్థానికులు మున్సిపల్ అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా లాభం లేదని.. అధికారులు దీనిపై స్పందిచడం లేదని.. తగిన చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఎవరైనా దీనిపై స్పందించి విచారణ చేపట్టాలని.. నిజమైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యేలా చూడాలని డిమాండ్ చేస్తున్నారు.ఇదిలా ఉంటే కొన్ని రోజుల క్రితం హౌసింగ్ వెరిఫికేషన్ అధికారులు 1950 మందికి మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లను రద్దు చేసిన సంగతి తెలిసిందే. హౌసింగ్ వెరిఫికేషన్ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో సుమారు 1,950 మంది అనర్హులకు ఇళ్లు మంజూరు చేసినట్లు గుర్తించారు. దీంతో అధికారుల వారి ఇళ్లను రద్దు చేశారు. మరోవైపు శాఖపరమైన చర్యలకు సిద్ధమవుతున్నారు అధికారులు. వీరందరికి గతంలోనే ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని.. అప్పుడు నిర్మాణం చేపట్టలేదని అధికారులు తెలిపారు.తొలి విడత రూ.లక్ష చెల్లించే సమయంలో వీరి గురించి తెలిసిందని.. అందుకే వెంటనే వీరికి కేటాయించిన ఇళ్లను రద్దు చేసి వారి స్థానంలో అర్హులైన కొత్త వారికి అవకాశం కల్పించాలని ఆదేశాలు జారీ చేశారు. మరి ఇప్పుడు ఒకే కుటుంబంలోమ 5గురు ఇందిరమ్మ ఇళ్లను పొందారన్న దానిపై అధికారులు ఎలా స్పందిస్తారో చూడాలి అంటున్నారు.

## రూట్ మార్చిన సైబర్ నేరగాళ్లు

# 'జంప్ డిపాజిట్' పేరుతో మోసం



**హైదరాబాద్,తెలంగాణ దిశ:**సైబర్ నేరగాళ్లు రూట్ మార్చుతున్నారు. ఇప్పుడు కొత్తగా 'రీఫండ్ క్యాష్ బ్యాక్' పేరుతో డబ్బులను కొట్టేస్తున్నారు. ఏపీకే ఫైల్స్ ను పంపించి బ్యాంక్ ఖాతాను ఖాళీ చేస్తున్నారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే వాటిలో ఈ తరహా మోసాలపై 80 శాతం ఫిర్యాదులు ఉంటున్నాయని పోలీసులు చెబుతున్నారు. యూపీఐ(యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్ఫేస్) చెల్లింపుల్లో ప్రపంచంలోనే భారత్ అగ్రస్థానంలో ఉంది. ప్రతినెలా రూ.1800 కోట్లకు పైగా లావాదేవీలు జరుగుతున్నాయని ఇంటర్ నేషనల్ మానిటరీ ఫండ్(ఎంఎంఎఫ్) సంస్థ తన నివేదికలో వెల్లడించింది. ప్రపంచంలో రియల్ టైమ్ డిజిటల్ చెల్లింపుల్లోనూ 50శాతం ఒక్క మన దేశంలోనే కొనసాగుతున్నాయని నివేదికలు చెబుతున్నాయి. ఇంత పెద్దమొత్తంలో లావాదేవీలు జరుగుతున్నందు వల్ల సైబర్ నేరగాళ్లు భారత్ ను ఎంచుకుంటున్నట్లు తెలుస్తున్నది.

**జంప్ డిపాజిట్ ఏమిటి?:** యూపీఐ యాప్‌లో డబ్బులు వచ్చాయని మెసేజ్ వస్తుంది. మనం చెక్ చేసుకోగానే మన బ్యాంకు ఖాతా ఖాళీ అవుతుంది. వాస్తవానికి వాళ్లు పంపించేది మనీ రిక్వెస్ట్ మెసేజ్ మాత్రమేనని సైబర్ సెక్యూరిటీ బ్యూరో తెలిపింది. ఇలా డబ్బుల వచ్చాయని మెసేజ్ లేదా సూచనలు రాగానే బ్యాలెన్స్ చెక్ చేసుకోవద్దని అధికారులు సూచిస్తున్నారు. బ్యాలెన్స్ చెకింగ్ కోసం యూపీఐ పిన్ ఎంటర్ చేయగానే డబ్బులు మన ఖాతాలో నుంచి అవతలి వ్యక్తులకు పోతాయని అధికారులు చెబుతున్నారు. ఇలాంటి ఘటనలపై ఇప్పటికే పలు ఫిర్యాదులు అందినట్లు సైబర్ బ్యూరో అధికారులు వెల్లడించారు.

**గోల్డెన్ అవర్ చాలా ముఖ్యం:** సైబర్ క్రైమ్ లో మోసపోయిన వెంటనే సైబర్ సెక్యూరిటీ బ్యూరోను సంప్రదించాలని సంబంధిత అధికారులు సూచిస్తున్నారు. ఏదైనా లావాదేవీలోమోసం జరిగిందనిభావిస్తే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలని చెబుతున్నారు. గోల్డెన్ అవర్ అనేది చాలాముఖ్యమని, ఫిర్యాదు వెంటనే చేసినట్లయితే లావాదేవీలు జరిగిన అకౌంట్లు గుర్తించి వెంటనే ఫ్రీజ్‌చేయొచ్చని సైబర్‌బ్యూరో వెల్లడించింది. **కంబోడియా వేదికగా..:** సైబర్ క్రైమ్ నేరాల్లో 70 శాతం కంబోడియా వేదికగా జరుగుతున్నాయని, తర్వాత దుబాయ్, చైనా దేశాల్లో జరుగుతున్నట్లు నేషనల్ సైబర్ క్రైమ్ గుర్తించింది. సైబర్ నేరగాళ్లు విదేశాల నుంచి ఏపీకే ఫైల్స్ ను పంపిస్తూ ఫోన్లను హ్యాక్ చేస్తున్నారు. ట్రేడింగ్ యాప్ పెట్టుబడి మోసాలు, లోన్ యాప్ ఇంకా పలు విధాలుగా బ్యాంకు ఖాతాలను ఖాళీ చేస్తున్నారు. ఈ తరహాలోనే ఇప్పుడు కొత్తగా జంప్ డిపాజిట్ చేరింది. మనీ రిక్వెస్ట్ యూపీఐకి మెసేజ్ పంపించి డబ్బును లూటీ చేస్తున్నారు. ఈ తరహా మోసాలపై జాగ్రత్తగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

# గ్రామాల్లో యూరియా కష్టాలు..?

**మెదక్,తెలంగాణ దిశ:** పంటల సాగు ప్రారంభం నుంచే రైతులు ఎరువుల కోసం పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. యూరియా కోసం రైతులు పడుతున్న కష్టాలు ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నాయి. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం పాలమాకుల సహకార కేంద్రం వద్ద యూరియా కోసం రైతులు ప్రతి రోజు భారీగా సంఖ్యలో బారులు తీరుతున్నారు.నంగునూరు మండలంలో గత వానాకాలంలో 25,878 ఎకరాల్లో సాగు చేయగా, అప్పట్లో 2600 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా అయ్యింది. కానీ, ఈసారి 25,750 ఎకరాలకు సాగు అంచనా వేసి, 1800 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని వ్యవసాయ అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. అయితే, ఇప్పటివరకు కేవలం 1100 మెట్రిక్ టన్నులు మాత్రమే నంగునూరు మండల కేంద్రానికి సరఫరా అయ్యింది.యూరియా సరఫరాలో ఎంత జాప్యం జరుగుతోందో స్పష్టమవుతోంది. రైతులకు సరిపడా యూరియాను సకాలంలో అందించకుండా, నిబంధనలతో ఇబ్బందులకు గురిచేయడంపై రైతులు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు.నంగునూరు మండలంలో రైతులు యూరియా కోసం పడుతున్న పాట్లు జిల్లాలో చర్చనీయాంశంగా మారాయి. గతంలో యూరియా పంపిణీ ఇంతటి గందరగోళానికి దారితీయలేదని రైతులు గుర్తు చేసుకుంటున్నారు. నాటి కేసీఆర్ ప్రభుత్వం రైతుల అవసరాలను గుర్తించి, యూరియాను నేరుగా ఇంటికే సరఫరా చేసేదని, ఇప్పుడు అలాంటి పరిస్థితులు లేకపోవడంపై రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.యూరియా పంపిణీలో ప్రభుత్వం ఓటీపీ విధానం మాకు తలనొప్పిగా మారింది. బస్తాలు మాకు నేరుగా ఇవ్వకుండా, ఓటీపీ విధానం ద్వారా ఇస్తున్నారు. ఒక్కరికి సుమారు 20 నిమిషాల సమయం పడుతుంది. చాలా సందర్భాల్లో సర్వర్ పనిచేయకపోవడం వల్ల గంటల తరబడి ఎదురుచూడాల్సి వస్తుంది. ఓటిపి విధానం తక్షణమే రద్దు చేయాలి.

పిల్లి కలవ్వ, రైతు, కోనాయిపల్లి.: గడిచిన 10 సంవత్సరాలలో పొలం పనులు వదిలి ఎరువుల కోసం పరుగులు పెట్టాల్సిన అవసరం ఉండేది కాదు. ఏ ఇబ్బంది లేకుండా సకాలంలో యూరియా దొరికేది, అందుకే పంటలు కూడా మంచిగ పండేవి. యూరియా మస్తుగ దొరికేది. ఇప్పుడు ఎరువుల కోసం ఎంత తిరిగినా దొరకతలేవు. నాటి ప్రభుత్వం మంచిగ చేసేది, ఇప్పుడైతే మమ్మల్ని మస్తు బాధ పెడుతున్నారు.యూరియా దళారులకు చేరొద్దని ఉద్దేశంతో ఓటీపీ విధానం ప్రభుత్వం అమలు చేసింది. ఈసారి అగ్రికల్చర్ కి మాత్రమే 1800 మెట్రిక్ టన్నుల యూరియా నివేదిక పంపించాం. మండలం లో ప్రస్తుతానికి వరి 18,500 ఎకరాల్లో సాగు చేశారు.రైతులు యూరియా వినియోగంపై స్పష్టమైన సమాచారం కోసం ఒక పాస్ బుక్కు రెండు యూరియా సంచులు మాత్రమే ఇవ్వాలని ఆదేశాలున్నాయి. యూరియా ఏ రోజు వస్తుందని ఒక రోజు ముందస్తుగానే రైతులకు సమాచారం అందిస్తున్నాము.

# తమిళనాడులో తారాస్థాయికి భాష రగడ

చెన్నై: మనదేశంలో రాజకీయ నాయకులు మాత్రమే కాదు గవర్నర్లకు కూడా రాజకీయ వాసనలు ఉంటాయి. గవర్నర్లను కేంద్ర ప్రభుత్వం నియమిస్తుంది. రాష్ట్రాలలో జరుగుతున్న పరిస్థితులను ఎప్పటికప్పుడు తమకు నివేదికల ద్వారా తెలియజేయాలని సూచిస్తుంది. అయితే గవర్నర్లు కొన్ని సందర్భాలలో తమ పరిధులు దాటుతుంటారు. రాష్ట్రానికి ప్రధాన పౌరులం అనే విషయాన్ని మర్చిపోయి.. రాజకీయాలలో వేలు పెడుతుంటారు. దీంతో పరిస్థితులు ఒక్కసారిగా చేయు దాటిపోతుంటాయి. గతంలో తెలంగాణ రాష్ట్రంలో కెసిఆర్, తమిళ సై సౌందరరాజన్ మధ్య కొద్ది రోజులపాటు ఇటువంటి పరిణామాలు జరిగాయి. ఇప్పుడు తమిళనాడులో కూడా అటువంటి పరిస్థితులు నెలకొన్నాయి.తమిళనాడు రాష్ట్రంలో డిఎంకె పార్టీ అధికారంలో ఉంది. స్టాలిన్ ముఖ్యమంత్రిగా వ్యవహరిస్తున్నారు. ఆ రాష్ట్రంలో ఆర్ఎన్ రవి గవర్నర్ గా కొనసాగుతున్నారు. రవి తమిళ భాషను వ్యతిరేకిస్తారని ఆ రాష్ట్ర ప్రజలు ముఖ్యంగా డీఎంకే కార్యకర్తలు తీవ్రస్థాయిలో విమర్శిస్తుంటారు. అంతేకాదు ఆయన సమయం దొరికిన ప్రతి సందర్భంలోనూ హిందీ లేదా ఇంగ్లీషులోనే ప్రసంగిస్తుంటారు. సహజంగానే మాతృభాష మీద విపరీతమైన ప్రేమ ఉండే తమిళులు గవర్నర్ వైఖరిని విపరీతంగా విమర్శిస్తుంటారు. సోషల్ మీడియాలో అయితే గవర్నర్ రవిని ఏకిపారేస్తుంటారు. కొంతకాలంగా గవర్నర్, డీఎంకే ప్రభుత్వానికి మధ్య విభేదాలు కొనసాగుతున్నాయి. నీట్ కు వ్యతిరేకంగా డీఎంకే ప్రభుత్వం ఒక తీర్మానం చేసినప్పుడు.. దానిని గవర్నర్ వ్యతిరేకించారు. అప్పట్లో ఇది తమిళనాడు రాష్ట్రంలో సంచలనం సృష్టించింది.తాజాగా ఆ రాష్ట్ర ప్రథమ పౌరుడికి ఓ యూనివర్సిటీ స్నాతకోత్సవంలో చేదు అనుభవం ఎదురయింది.. డీఎంకే నేత భార్య జీన్ జోసెఫ్ అత్యున్నత విద్యను పూర్తి చేశారు. గవర్నర్ నుంచి డిగ్రీ పట్టా తీసుకోవడానికి ఆమె నిరాకరించారు. వేదిక మీద ఉన్న ఆయనను పట్టించుకోకుండానే వెళ్లి.. వైస్ ఛాన్స్ లర్ చేతుల మీదుగా పట్టా తీసుకున్నారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తోంది. డీఎంకే నేత భార్య వ్యవహరించిన తీరును బిజెపి నాయకులు తప్పు పడుతుండగా.. తమిళనాడు ఆత్మాభిమానాన్ని జీన్ జోసెఫ్ ప్రదర్శించారని డిఎంకె కార్యకర్తలు అంటున్నారు.. ఆమెను తమిళ విప్లవ నాయకిగా అభివర్ణిస్తున్నారు.తమిళనాడులో భాష రాజకీయాలు ఇదే తొలిసారి కాదు. కానీ ఇప్పుడు అవి తారస్థాయికి చేరిపోయాయి. అధికార డిఎంకె కేంద్రంపై తీవ్రస్థాయిలో విమర్శలుచేస్తోంది. హిందీని బలవంతంగా రుద్దుతున్నారని ఆరోపిస్తోంది. గతంలో ఉన్న కేంద్ర ప్రభుత్వాలు ఇలా చేయడం వల్లే ఉద్యమాలు వచ్చాయని.. ఇప్పుడు కేంద్రం కూడా అదే ధోరణి కొనసాగిస్తున్న నేపథ్యంలో.. ఉద్యమాలు మొదలవుతున్నాయని డీఎంకే నేతలు చెబుతున్నారు. మరోవైపు హిందీని తాము బలవంతంగా రుద్దడం లేదని, లేనిపోని గొడవలు సృష్టించి ఎన్నికల్లో లబ్ధి పొందాలని డీఎంకే నేతలు భావిస్తున్నారని బిజెపి నాయకులు చెబుతున్నారు.

## భాగ్యనగరంలో ట్రాఫిక్ కష్టాలకు

# చెక్




**హైదరాబాద్,తెలంగాణ దిశ:** భాగ్యనగరంలో పార్కింగ్ కష్టాలకు చెక్.. మీరు వింటుంది నిజమే..! మహానగరం నడిబొడ్డున ఉన్న నాంపల్లిలో పార్కింగ్ కోసం ఇక మీదట ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవతో అత్యాధునిక మల్టీ లెవెల్ పార్కింగ్ కాంప్లెక్స్ అందుబాటులోకి రాబోతుందిదీంతో సెంట్రల్ సిటీలో పార్కింగ్ కష్టాలకు పులిస్టాప్ పడ్డట్టే..! ఇంతకీ ఏంటి ఆ మల్టీ లెవెల్ పార్కింగ్ కాంప్లెక్స్? అక్కడ ఎన్ని కార్లు పార్కింగ్ చేసుకోవచ్చు?భాగ్యనగ రంలో పార్కింగ్ కష్టాలకు చెక్.. మీరు వింటుంది నిజమే..! మహానగరం నడిబొడ్డున ఉన్న నాంపల్లిలో పార్కింగ్ కోసం ఇక మీదట ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవతో అత్యాధునిక మల్టీ లెవెల్ పార్కింగ్ కాంప్లెక్స్ అందుబాటులోకి రాబోతుంది. దీంతో సెంట్రల్ సిటీలో పార్కింగ్ కష్టాలకు పులిస్టాప్ పడ్డట్టే..! ఇంతకీ ఏంటి ఆ మల్టీ లెవెల్ పార్కింగ్ కాంప్లెక్స్? అక్కడ ఎన్ని కార్లు పార్కింగ్ చేసుకోవచ్చు? ఇందులో కొత్తదనం ఏముంది? తెలుసుకుందాం.హైదరాబాద్ మహానగర వాసులను నిత్యం వేధిస్తున్న వాహనాల పార్కింగ్ సమస్యను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పూర్తి ఆటోమేటెడ్, కంప్యూటరైజ్డ్ మల్టీ లెవల్ కార్ పార్కింగ్ కాంప్లెక్స్‌కు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే పనులు దాదాపు పూర్తి అయ్యాయి. నాంపల్లి మెట్రో స్టేషన్ సమీపంలో పబ్లిక్ అండ్ ప్రైవేట్ భాగస్వామ్యంతో ఈ ప్రాజెక్టును చేపట్టారు. కొన్ని కారణాల వల్ల ఈ ప్రాజెక్టు నిర్మాణం ఆలస్యం అయినా ఎట్టకేలకు పూర్తి అయింది.మహానగర వాసులను వేధిస్తున్న పార్కింగ్ సమస్యను అధిగమించేందుకు నాంపల్లి మెట్రో రైల్ స్టేషన్ సమీపంలో ఉన్న హెచ్ఎంఆర్‌కు చెందిన అర ఎకరం స్థలంలో 15అంతస్తులలో ఈకాంప్లెక్స్ నిర్మాణం జరిగింది. ఇందులో 10 అంతస్తుల్లో వాహనాల పార్కింగ్ సౌకర్యం.. మరో ఐదు అంతస్తుల్లో కమర్షియల్ షాపులు, రెండు స్క్రీన్‌లతో కూడిన థియేటర్ కూడా నిర్మించారు. పబ్లిక్, ప్రైవేట్ విధానంలో దాదాపు రూ. 100కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్టుని నిర్మాణం జరిగింది. అత్యంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో దేశంలోనే తొలిసారిగా జర్మన్ పాలిస్ పార్కింగ్ విధానంలో, తక్కువ స్థలంలో ఎక్కువ వాహనాలు పార్కింగ్ చేసేలా ఈ ప్రాజెక్టును చేపట్టినట్టు మెట్రో ఎండీ ఔమా రెడ్డి వివరించారు.ఈ కాంప్లెక్స్‌లో మొత్తం 15 అంతస్తులు ఉంటాయి. ఇందులో 3 బేస్‌మెంట్లు, 7 పైఅంతస్తులు కలిపి మొత్తం 10 అంతస్తుల్లో పార్కింగ్ సదుపాయం ఉంటుంది.

మరో 5 అంతస్తులను కమర్షియల్ పర్పస్ కేటాయించారు. ఈ పార్కింగ్ కాంప్లెక్స్‌లో అన్ని రకాల సదుపాయాలు కలిగిన రెండు సినీ థియేటర్‌లను కూడా ఏర్పాటు చేశారు. 11వ అంతస్తులో నగర వీక్షణ కోసం గ్యాలరీని ఏర్పాటు చేశారు. మొత్తం 10 పార్కింగ్ అంతస్తుల్లో 200 పైగా కార్లు, 200 వరకు టూ వీలర్ పార్కింగ్ చేయవచ్చని, ఈ ప్రాజెక్టు ద్వారా నగర ప్రజలకు ప్రపంచ స్థాయి పార్కింగ్ అనుభవం అందించనున్నామని అధికారులు అంటున్నారు.

# మంథని చైతన్యపురి కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించండి

## –మంథని బిజెపి నాయకులు



**మంథని,తెలంగాణ దిశ:** మంథని మున్సిపల్ పరిధిలోని చైతన్యపురి కాలనీలో నెలకొన్న సమస్యలను మున్సిపల్ అధికారులు వెంటనే పరిష్కరించాలని మంథని పట్టణ బిజెపి నాయకులు డిమాండ్ చేశారు. శనివారం చైతన్యపురి కాలనీలో భారతీయ జనతా పార్టీ నాయకులు సందర్శించి ప్రజలతో మమేకమై అక్కడ ఉన్నటువంటి సమస్యలను అడిగి తెలుసుకోన్నారు .ఇక్కడ పరిస్థితులను చూస్తే అధికారులు కేవలం రోడ్లను మాత్రమే నిర్మించి డ్రైనేజీ నిర్మాణాలు పూర్తిగా మరిచిపోయారని వారు విమర్శించారు.

ఈ కాలనీలో 90శాతం ఇండ్లకు డ్రైనేజీ వ్యవస్థ లేదని చెప్పుకోవడానికి సిగ్గుచేటుగా ఉందన్నారు. ఈ వర్షాకాలంలో చిన్నపాటి వర్షానికే మురికి నీరు రోడ్లపైన ప్రవహిస్తున్నటువంటి దృశ్యాలు అడుగడుగునా కనిపిస్తున్నాయన్నారు. ప్రతి ఇంటి చుట్టూ చెరువులను తలపించేలా నీళ్లు చేరి దోమలతో, ఈగలతో, పిచ్చి చెట్లతో అత్యంత దారుణంగా పరిస్థితులు ఇక్కడ నెలకొని ఉన్నాయన్నారు. ప్రజానీకం విష జ్వరాల పాలవుతున్నారని, స్కూల్ పిల్లలు సైతం ఈ మురికి నీరు ప్రవహిస్తున్న రోడ్డుపై నుండి స్కూళ్లకు వెళ్తున్నారని ఇంత దారుణ పరిస్థితులు ఉన్నా ఏ నాయకుడు గాని ఏ అధికారి గాని వీళ్ళ వద్దకు వచ్చిన వారు లేరని,సమస్యలను తెలుసుకున్న వారు లేరని వారు విమర్శించారు. వెంటనే మున్సిపల్ అధికారులు స్పందించి ఈ కాలనీ సమస్యలను పరిష్కరించాలన్నారు.లేని పక్షంలో స్థానిక సంస్థల

ఎలక్షన్లు కొద్ది రోజుల్లోనే జరగనున్నాయని గుర్తు చేస్తూ మీ వల్ల కానీఈ పనిని భారతీయ జనతా పార్టీ ఈఎలక్షన్లలో గెలిచి ఈ పనులన్నీ చేసి చూపిస్తుందని ప్రజలకు హామీ ఇచ్చారు. బిజెపి నాయకులు ఈసంపల్లి కొమురయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మంథని పట్టణ బిజెపి అధ్యక్షులు సబ్బని సంతోష్, పట్టణ ప్రధాన కార్యదర్శి సామల అశోక్, పట్టణ కార్యదర్శి పార్వతీ విష్ణు మరియు స్థానిక చైతన్యపురి కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

# మరో 6 నెలలు పొడిగింపు

**కరీంనగర్,తెలంగాణ దిశ:** ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల పొడగించిన పదవీకాలం ముగిసింది. ప్రభుత్వం మరోమారు ఆరు నెలలపాటు పొడగిస్తూ జీవో ఎంఎస్ నెం. 836ను జారీ చేసింది. కరీంనగర్ సహకార కేంద్ర బ్యాంకు పరిధిలో ఉన్న నాలుగు జిల్లాల్లోని 131 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల పదవీకాలం మరో ఆరు నెలలు కొనసాగుతుంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని 131 పీఏసీఎస్లకు 2020 ఫిబ్రవరి 12న ఎన్నికలు జరిగాయి.ఆ తర్వాత సహకార సొసైటీల పాలకవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. వీటి ఐదేళ్ల గడువు ఈ సంవత్సరం ఫిబ్రవరి 13న ముగియగా, ప్రభుత్వం ఎన్నికలకు వెళ్లకుండా ఆరు నెలల పదవీకాలం పొడగించింది. ఈ ఆరు నెలల పదవీకాలం గురువారం ముగియగా మరోమారు పొడగించడంతో సహకార సంఘాల ఎన్నికలను ప్రభుత్వం ఇప్పట్లో నిర్వహించే ఆలోచనలో లేనట్లు స్పష్టమయింది. కరీంనగర్ జిల్లాలో 30, జగిత్యాల జిల్లాలో 51, రాజన్న సిరిసిల్లలో 22, పెద్దపల్లి జిల్లాలో 28 పిఏసిఎస్ లు ఉన్నాయిజిల్లాల పునర్విభజన అనంతరం కూడా జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఉమ్మడి జిల్లా పరిధిలో కొనసాగుతుంది. జిల్లా పరిషత్, మండల పరిషత్ ల విభజన జరిగింది కానీ, అప్పటి ప్రభుత్వం ఆర్బీఐ నుండి ప్రత్యేక చట్టం తీసుకురాకపోవడంతో ఉమ్మడి జిల్లా పరిధిలోనే నేటికి కొనసాగుతూ వస్తుంది. అయితే సొసైటీల బలోపేతం, సహకార సంఘాల వ్యవస్థ పటిష్టతకు రాష్ట్ర ప్రభుత్వం దృష్టిసారించిన నేపథ్యంలో ఎన్నికలు ఇప్పుడే నిర్వహించే ఆలోచన చేయకుండా పదవీకాలం పొడగించింది. ఈ పదవీకాలం పొడగింపు ద్వారా గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఉన్న ఎక్కువ మంది పీఏసీఎస్ చైర్మన్లు, జిల్లా సహకార కేంద్ర బ్యాంకు డైరెక్టర్ల పదవులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా వారే కొనసాగనున్నారు.కరీంనగర్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అధ్యక్షునిగా బీఆర్ఎస్ పార్టీకి చెందిన గంభీరావుపేట ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం చైర్మన్ కొండూరి రవీందర్ రావు కొనసాగుతున్నారు. ఆయన బీఆర్ఎస్ హయాంలో టెస్కాబ్ తెలంగాణ సహకార సంఘం అధ్యక్షనిగా కొనసాగారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్దిరోజులు కొనసాగిన అనంతరం ఆయనపై అవిశ్వాసానికి టెస్కాబ్ డైరెక్టర్లు సిద్ధం కావడంతో ఆయన ఆ పదవికి రాజీనామా చేశారు. ఆయన ప్రస్తుతం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అధ్యక్షునిగా సేవలు కొనసాగిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి ఉన్నప్పటికి ప్రభుత్వ ఉత్తర్వు ద్వారా ఆయనకు మరో ఆరు నెలలు చైర్మన్ గా పనిచేసే అవకాశం దక్కింది.

# కర్నూలులో గోల్డ్ మైన్



**కర్నూలు,తెలంగాణ దిశ:** దేశంలోనే మొట్టమొదటి అతిపెద్ద ప్రైవేట్ బంగారు గని ఆంధ్రప్రదేశ్‌లోనే త్వరలో అందుబాటులోకి రానున్నాయి. త్వరలోనే ఉత్పత్తి ప్రారంభించనున్నట్లు ఆ బంగారు గనిని నిర్వహిస్తున్న సంస్థ వెల్లడించింది. మొదట తక్కువ స్థాయిలో ఉత్పత్తిని ప్రారంభించి.. ఆ తర్వాత దాన్ని భారీగా పెంచనున్నట్లు సదరు సంస్థ తెలిపింది. ఈ బంగారు గని పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే.. దేశ బంగారం అవసరాల కోసం ఇతర దేశాలపై ఆధారపడటం కాస్త తగ్గుతుందని నిపుణులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.బంగారం అంటే భారత్‌లో కేవలం ఒంటిపై వేసుకునే ఆభరణాలుగా మాత్రమే కాకుండా.. అదో ఆస్తిగా కూడా భావిస్తారు.భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో బంగారానికి అత్యంత ప్రాధాన్యత కూడా ఉంటుంది. అందుకే భారతీయులు భారీగా బంగారాన్ని కొనుగోలు చేస్తారు. వాటిని అవసరమైన సమయాల్లో తాకట్టు పెట్టి.. డబ్బును తీసుకుంటారు. అయితే ప్రపంచంలోని అన్ని దేశాల కన్నా ఎక్కువగా బంగారాన్ని భారత్ వినియోగిస్తున్నా.. ఉత్పత్తిలో మాత్రం చాలా వెనకబడి ఉంది. ఇక మన దేశం.. విదేశాల నుంచి చమురు తర్వాత అత్యంత ఎక్కువగా దిగుమతి చేసుకునేది బంగారమే కావడం గమనార్హం. అయితే తాజాగా భారత్‌లోనే తొలి అతిపెద్ద ప్రైవేట్ బంగారు గని నుంచి బంగారాన్ని వెలికితీయనున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా తుగ్గలి మండలంలోని జొన్నగిరి, ఎర్రగుడి, పగిదిరాయి గ్రామాల్లో ఉన్న

## ఆ గ్రామాలు.. బంగారం

ఈ బంగారు గని నుంచి బంగారాన్ని వెలికితీసే ప్రాజెక్టును డెక్కన్ గోల్డ్ మైన్స్ లిమిటెడ్ (డీజీఎంఎల్) నిర్వహిస్తోంది. ఈ సంస్థ త్వరలోనే ఆ ప్రాంతంలో బంగారం ఉత్పత్తిని ప్రారంభించనుంది. ఈ గని దేశం బంగారు ఉత్పత్తిని గణనీయంగా పెంచనుందని నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం ఏటా భారత్ సుమారు వెయ్యి టన్నుల బంగారాన్ని ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటుంది. చమురు తర్వాత బంగారం దేశంలో అత్యధికంగా దిగుమతి అయ్యే వస్తువు కావడం విశేషం. ప్రస్తుతం భారత్ మొత్తం బంగారు ఉత్పత్తి కేవలం 1.5 టన్నులు మాత్రమే కావడం గమనార్హం. ఈ నేపథ్యంలోనే జొన్నగిరిబంగారు గని పూర్తిస్థాయిలో ఉత్పత్తిని ప్రారంభించడం భారత్‌కు బంగారం విషయంలో ఒక కీలక ముందడుగుగా మారుతుందని నిపుణులు పేర్కొంటున్నారు.ఇక ఈ గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టును అభివృద్ధి చేస్తున్న జియోమైసోర్ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్‌లో డెక్కన్ గోల్డ్ మైన్స్ సంస్థకు వాటా ఉంది. ఈ ప్రాజెక్టుకు అవసరమైన పర్యావరణ అనుమతులు ఇప్పటికే లభించాయని.. రాష్ట్ర అనుమతులు కూడా కోరుతున్నట్లు డెక్కన్ గోల్డ్ మైన్స్ లిమిటెడ్ ఎండీ హనుమ ప్రసాద్ గురువారం వెల్లడించారు. ఇక ఈ గనిని ప్రారంభించిన తర్వాత తొలి దశలో.. ఏటా సుమారు 750 కిలోల బంగారాన్ని ఉత్పత్తి చేయనున్నట్లు అంచనా వేస్తున్నారు. ఆ తర్వాత రానున్న 2, 3 ఏళ్లలో ఈ బంగారం ఉత్పత్తిని ఏటా వెయ్యి కిలోలకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సంస్థ ఎండీ హనుమ ప్రసాద్ వెల్లడించారు. కర్నూలు జిల్లాలో ఉన్న ఈ గోల్డ్ మైన్ నుంచి ఉత్పత్తి ప్రారంభం అయిన తర్వాత.. భారత దేశీయ బంగారు ఉత్పత్తి దాదాపు ఒక టన్ను మేర పెరుగుతుందని హనుమ ప్రసాద్ వివరించారు. ఈ ప్రాజెక్ట్ దేశ బంగారు పరిశ్రమలో ఒక నూతన అధ్యాయాన్ని లిఖిస్తుందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఇక ఈ ప్రాజెక్టును నిర్వహిస్తున్న డెక్కన్ గోల్డ్ మైన్స్ సంస్థకు కిర్గిస్తాన్, ఫిన్లాండ్, టాంజానియా వంటి దేశాల్లో కూడా మైనింగ్ ప్రాజెక్టులను కలిగి ఉంది..

# రాజకీయాలకు దూరంగా వల్లభనేని



**విజయవాడ,తెలంగాణ దిశ:** గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ హైదరాబాద్‌లోనే ఉంటున్నారు. రాజకీయాలపై పెద్దగా ఆసక్తి చూపడం లేదని చెబుతున్నారు. ఆయన జైలు నుంచి విడుదలయి దాదాపు రెండు నెలలు గడుస్తున్నప్పటికీ ఇప్పటి వరకూ గన్నవరం నియోజ కవర్గంలో పర్యటించకపోవడం వెనక కారణమదేనని అంటున్నారు. వల్లభనేని వంశీ కుటుంబ సభ్యులు కూడా రాజకీయాలు మానుకుని, వ్యాపారాలు చూసుకోవాలని సూచిస్తున్నట్లు తెలిసింది. రాజకీయాల వల్ల ఆరోగ్యంతో పాటు ఆర్థిక ఇబ్బందులు పడాల్సి వస్తుందని, దానికంటే వ్యాపారాలు చేసుకోవడమే బెటరన్న అభిప్రాయంలో వల్లభనేని వంశీ కుటుంబ సభ్యులు ఉన్నారు. దీంతో ఆయన కూడా పునరాలోచనలో పడినట్లు చెబుతున్నారు.వల్లభనేని వంశీ విజయవాడ జిల్లా జైలు నుంచి విడుదల అయి రెండు నెలలు పైనే అవుతుంది. అన్ని కేసుల్లో బెయిల్ రావడంతో జైలు నుంచి ఆయన విడుదలయ్యారు. వల్లభనేని వంశీపై పదకొండు కేసులు నమోదు కావడంతో దాదాపు 137 రోజుల పాటు విజయవాడ జిల్లా జైలులోనే ఉన్నారు. కొన్ని కేసుల్లో ముందస్తు బెయిల్, మరికొన్నికేసుల్లో షరతులతో కూడిన బెయిల్ లభించింది. పోలీస్ స్టేషన్లలో సంతకాలు చేయాలన్న షరతులను ఆయన పాటిస్తున్నారు. అంతే తప్ప రాజకీయాల జోలికి మాత్రం గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ పోవడం లేదు. అదే సమయంలో జైలు నుంచి వచ్చిన తర్వాత వైసీపీ అధినేత వైఎస్ జగన్ ను కలసిన తర్వాత మళ్లీ కనిపించకుండా పోయారు. . కానీ గన్నవరం నియోజకవర్గానికి త్వరలో వల్లభనేనేని వంశీ వస్తారని నియోజకవర్గంలోని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. ముఖ్య కార్యకర్తలతోవల్లభనేనేని వంశీ టచ్ లో ఉన్నారని, ఫోన్ లో మాట్లాడుతున్నారని, ఆరోగ్యం కుదుటపడిన తర్వాత వస్తారని అంటున్నారు. జైల్లో ఉన్న సమయంలో ఊపిరి తిత్తులకు సంబంధించిన వ్యాధి రావడంతో ఆయన ఆరోగ్యపరంగా ఇబ్బందులు పడుతున్నారని, ఆరోగ్యం పడిన తర్వాత తిరిగి గన్నవరం నియోజకవర్గానికి వల్లభనేనేని వంశీ వస్తారని అంటున్నారు. ప్రస్తుతం హైదరాబాద్ లో ఉన్న వల్లభనేని వంశీ ఆరోగ్య పరీక్షలు తరచూచేయించుకుంటున్నారని అంటున్నారు. మొత్తం మీద వంశీ రాజకీయాలను వదిలేస్తారన్న ప్రచారం మాత్రం సోషల్ మీడియాలో జోరుగా జరుగుతుంది. ఇందులో నిజమెంత? అన్నది తెలియాలంటే ఆయన మాత్రమే క్లారిటీ ఇవ్వాల్సి ఉంది.

# ఎట్టకేలకు మౌనం వీడిన ధర్మాన

**శ్రీకాకుళం,తెలంగాణ దిశ:** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత ధర్మాన ప్రసాదరావు మౌనం వీడారు. కూటమి ప్రభుత్వం పై విమర్శలు గుప్పించారు. తద్వారా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో యాక్టివ్ అయినట్లు సంకేతాలు పంపించారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత ధర్మాన ప్రసాదరావు పెద్దగా కనిపించలేదు. పార్టీ కార్యక్రమాలకు సైతం హాజరు కావడం లేదు. దీంతో ఆయన వైయస్సార్ కాంగ్రెస్ లో ఉన్నారా? లేదా? అన్న అనుమానం కూడా కలిగింది. ఒకానొక దశలో ఆయన తన కుమారుడి రాజకీయ భవిష్యత్తు కోసం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెబుతారని కూడా ప్రచారం నడిచింది. ముఖ్యంగా జనసేనలో చేరుతారని టాక్ నడిచింది. కానీ 15 నెలలు అవుతున్న ఆయన రాజకీయ నిర్ణయంలో ఎటువంటి సంచలనాలు నమోదు కాలేదు. అదే సమయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంటూ వచ్చారు ధర్మాన ప్రసాదరావు. ఈ తరుణంలో ఆయన మౌనం వీడారు. కూటమి ప్రభుత్వం పై విమర్శలు చేశారు. దీంతో ఆయన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతారని స్పష్టమైంది.ఉమ్మడి ఏపీ లోనే సీనియర్ మోస్ట్ లీడర్ ధర్మాన ప్రసాదరావు. కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘకాలం సేవలందించారు. యువజన కాంగ్రెస్ ద్వారా ఎంట్రీ ఇచ్చారు. తొలుత సర్పంచ్ గా, తరువాత ఎంపీపీగా, అటు తరువాత ఎమ్మెల్యేగా గెలిచి సుదీర్ఘకాలం మంత్రిగా కూడా వ్యవహరించారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ఆయన ప్రధాన అనుచరుడిగా వ్యవహరించారు. 2004 నుంచి 2014 వరకు సుదీర్ఘకాలం మంత్రిగా ఉండేవారు. తండ్రి అకాల మరణంతో కాంగ్రెస్ పార్టీని వీడారు జగన్ మోహన్ రెడ్డి. ఆ సమయంలో జగన్ వైఖరిని వ్యతిరేకించారు ధర్మాన ప్రసాదరావు. ఒకానొక సమయంలో జగన్మోహన్ రెడ్డి పై తీవ్ర వ్యాఖ్యలు కూడా చేశారు. కానీ 2014లో రాష్ట్ర విభజనతో కాంగ్రెస్ పార్టీ ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొంది. దీంతో జగన్మోహన్ రెడ్డి గత్యంతరం లేని స్థితిలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు.2014 ఎన్నికల కు ముందు వైసీపీలోచేరారు ధర్మాన ప్రసాదరావు. అప్పటికే ఆయన సోదరుడు కృష్ణదాస్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో యాక్టివ్ రోల్ ప్లే చేస్తూ వచ్చారు. అప్పటివరకు జగన్ వైఖరిని వ్యతిరేకించిన ధర్మాన ప్రసాదరావు వైయస్సార్ కాంగ్రెస్



పార్టీలో చేరడంతో తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొన్నారు. ఆ ప్రభావం 2014 ఎన్నికల్లో పడింది. ధర్మాన సోదరులు ఇద్దరూ ఓడిపోయారు. అయితే ధర్మాన తన శక్తి యుక్తులను ఉపయోగించి 2019లో శ్రీకాకుళం జిల్లాలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేశారు. వైసీపీ అధికారంలోకి రావడంతో మంత్రి పదవి ఖాయమని అంచనా వేసుకున్నారు. జగన్మోహన్ రెడ్డి మాత్రం ధర్మాన ప్రసాదరావు సోదరుడు కృష్ణ దాస్ కు మంత్రి పదవి ఇచ్చారు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన ధర్మాన ప్రసాదరావు పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉండిపోయారు. విస్తరణలో చోటిచ్చేసరికి మళ్ళీ యాక్టివ్ అయ్యారు ధర్మాన ప్రసాదరావు.2024 ఎన్నికల్లో తన రాజకీయ జీవితంలో ఎదురుకాని ఓటమి ధర్మాన ప్రసాదరావుకు ఎదురయ్యింది. టిడిపి అభ్యర్థిగా ఓ సామాన్య సర్పంచ్ బరిలో దిగగా.. 52 వేల ఓట్ల తేడాతో ఓడిపోయారు ధర్మాన ప్రసాదరావు. దీంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో కొనసాగితే తనకు భవిష్యత్తు ఉండదని భావించారు. తన కుమారుడికి రాజకీయ భవిష్యత్తు ఉండాలంటే జనసేనలో చేరడం ఉత్తమం అని భావించారు. ఒకానొక దశలో ఆయన తెలుగుదేశం పార్టీలో చేరుతారని.. రాజ్యసభ పదవి ఆఫర్ వచ్చిందని ప్రచారం నడిచింది. అయితే కూటమి పార్టీల నుంచి సానుకూలత లేకపోవడంతో ఆయన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగేందుకు దాదాపు సిద్ధపడినట్లు ప్రచారం సాగుతోంది. తాజాగా కూటమి ప్రభుత్వంపై ధర్మాన విమర్శలు చూస్తుంటే ఆయన వైసీపీలో యాక్టివ్ అయినట్టు కనిపిస్తోంది. మరి చూడాలి ధర్మాన వ్యవహార శైలి మున్ముందు ఎలా ఉండబోతుందో..

# పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

**- నియోజకవర్గ ప్రజల కోసం నిరంతం పని చేస్తున్నాం**

**- పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు**





**పెద్దపల్లి,తెలంగాణ దిశ:** పట్టణ కేంద్రంలోని నందన గార్డెన్స్‌లో పెద్దపల్లి నియోజకవర్గ పరిధిలోని 820 మంది ముఖ్యమంత్రి సహాయనిధి లబ్ధిదారులకు రూ.2,64,06,900 విలువ గల చెక్కులను, అలాగే పెద్దపల్లి మండలం, పట్టణానికి సంబంధించిన 133 మంది కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ లబ్ధిదారులకు రూ.1,33,15,428 విలువ గల చెక్కులను స్థానిక తహసీల్దార్, స్థానిక నాయకులతో కలిసి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ పేద ప్రజల ఆనందమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. పెద్దపల్లి నియోజకవర్గాన్ని అగ్రగామిగా నింపేందుకు అహర్నిశలు కష్టపడుతున్నామని తెలిపారు. ప్రవేటు ఆసుపత్రులకు ధీటుగా పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యసేవలను అందిస్తుందని ప్రభుత్వ ఆసుపత్రి సేవలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలి పిలునిచ్చారు. ప్రభుత్వ ఆసుపత్రిని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తూ ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో జిల్లా కలెక్టర్, తాను నిరంతరం పని చేస్తున్నామని గుర్తు చేశారు. కోట్ల రూపాయలను వెచ్చించి అధునాతన హంగులతో ప్రభుత్వ ఆసుపత్రిని 100 పడకలకు ఆధునీకరణ చేస్తున్నామని అన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకునే వారికి అన్ని రకాల సౌకర్యాల ను తమ క్యాంపు కార్యాల యంలో ఏర్పాటు చేశామని ప్రజలందరూ స్వేచ్ఛగా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ ఆసుపత్రులపై దృషి సారించి వాటిని అభివృద్ధి పరుస్తున్నారని ప్రజలందరూ ప్రభుత్వ ఆసుపత్రి సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా పెద్దపల్లి నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాల ను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి తహసీల్దార్ రాజయ్య, వ్యవసాయ మార్కెట్ చైర్మన్లు ఈర్ల స్వరూప, మినుపాల ప్రకాష్ రావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకు లు, కార్యకర్తలు, పెద్ద సంఖ్య లో లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# చిక్కడు..దొరకడు.. శ్రీనివాసుడు



**తిరుపతి,తెలంగాణ దిశ:** ఉమ్మడి చిత్తూరు జిల్లాలో జనసేన పోటీ చేసి గెలిచిన ఏకైక అసెంబ్లీ సీటు తిరుపతి. ఆరణి శ్రీనివాసులు ఇక్కడి నుంచి ఎమ్మెల్యే అయ్యారు. ఉమ్మడి జిల్లాలో పోటీ చేసింది ఒకే సీటు అయినా?ఎన్నికల టైంలో? ఆ గెలుపు సౌండ్ మాత్రం రాయలసీమ మొత్తంలో ప్రతిధ్వనించింది. చివరి నిమిషంలో సీటు దక్కినా? 60వేలకు పైగా భారీ మెజారిటీతో ఆరణి విజయం సొంతం చేసుకోవడం గురించి అప్పట్లో బాగా మాట్లాడుకున్నారు. ఎన్నికలకు ముందు వరకు వైసీపీ ఎమ్మెల్యే గా ఉన్న శ్రీనివాస్‌కు సీటు ఇవ్వడాన్ని తిరుపతి టిడిపి, జనసేన నేతలు తీవ్రంగా వ్యతిరేకించినా.. పవన్ కళ్యాణ్ మాత్రం ఆయనవైపే మొగ్గారు. సరే? పెద్దోళ్ళు నిర్ణయం తీసుకున్నారు, ఇక చేసేదేముందనుకుంటూ? అంతా కలిసి పని చేయడంతో భారీ మెజార్టీ సాధ్యమైందన్నది స్థానికంగా ఉన్న అభిప్రాయం. ఇక గెలిచాక? చాలామంది ఎమ్మెల్యేల్లాగే? ఆరణి కుటుంబ సభ్యులు కూడా సీన్‌లోకి ఎంటరైపోయారు. ఆగడాలు శృతిమించుతున్నాయన్న ఫిర్యాదులు వెల్లువెత్తడంతో?. డైరెక్ట్‌గా పవన్‌కళ్యాణ్ జోక్యం చేసుకుని ఎమ్మెల్యేకి క్లాస్ పీకినట్టు చెప్పుకున్నారు. అది నిజమేనా అన్నట్టు కొన్నాళ్ళుగా?. ఆరోపణల పరంపర తగ్గిపోయింది. ఆరణి కూడా తిరుపతి నగర అభివృద్ధి మీదే దృష్టి పెట్టారన్న మాటలు వినిపిస్తున్నాయి. అంతవరకు బాగానే ఉందని అనుకుంటున్నా?. ఈ మధ్యకాలంలో మాత్రం ఆయన వ్యవహారం గురించి కూటమి నేతల్లో కొత్త చర్చ జరుగుతోందట. ఎమ్మెల్యే కేవలం శంకుస్థాపనలు, సమస్యల పరిష్కారం అంటూ తిరుగుతున్నారు తప్ప? రాజకీయంగా ఏ మాత్రం శ్రద్ధ తీసుకోవడం లేదని, అది వైసీపీకి అలుసుగా మారుతోందని మాట్లాడుకుంటున్నట్టు తెలిసిందఎమ్మెల్యేకి ఇప్పటికీ సొంత పార్టీలోని కొందరితో పాటు? టీడీపీ నాయకులతో కూడా గ్యాప్ ఉన్నట్టు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. అయినాసరే? ఆ గ్యాప్‌ని తగ్గించుకునేందుకు ఆరణి వైపు నుంచి చొరవలేదని కూటమి నాయకులు అసహనంగా ఉన్నారట. పైగా? నియోజకవర్గంలో మారుతున్న తాజా రాజకీయ పరిస్థితుల్లో ఆయన మౌనం ఎందుకంటూ కూటమి కార్యకర్తలు తలలు పట్టుకుంటున్నట్టు తెలుస్తోంది. ఓవైపు తిరుపతి వైసీపీ లీడర్స్ చెలరేగుతున్నా? ఇక్కడ ఆరణి శ్రీనివాస్ వైపు నుంచి మాత్రం నో రియాక్షన్ అంటూ స్థానిక నాయకులు కొందరు జనసేన అధిష్టానానికి ఫిర్యాదు చేసినట్టు సమాచారం. ముఖ్యంగా పార్టీ అధినేత పవన్ కళ్యాణ్‌ను, టీడీపీని టార్గెట్ చేసుకుంటూ టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి చేస్తున్న విమర్శలకు ఆశించిన స్థాయిలో కాదు కదా? అసలు ఎదుర్కొనే కనీస ప్రయత్నం కూడా ఎమ్మెల్యే వైపు నుంచి జరగడం లేదని రగిలిపోతున్నారట జనసైనికులు. భూమన కరుణాకర్ రెడ్డి గోశాల సహా?. తిరుమల టార్గెట్‌గా పలు వివాదాలను తెరపై తెస్తూ? రోజుకో ప్రెస్ మీట్‌తో ముఖ్యమంత్రిని, ఉప ముఖ్యమంత్రిని, మొత్తం ప్రభుత్వాన్నే ఇరుకున పెట్టే ప్రయత్నం చేస్తుంటే? స్థానిక ఎమ్మెల్యేగా ఉంటూ? ఆరణి శ్రీనివాస్ ఎందుకు కౌంటర్ చేయలేకపోతున్నారని సోషల్ మీడియా వేదికగా ఓ రేంజ్ లో ఆడేసుకుంటున్నారట జనసేన కార్యకర్తలు. నగర అభివృద్ధి అంటూ ఎమ్మెల్యే తిరగడం వందకు వంద శాతం కరెక్టేగానీ?అదే సమయంలో ప్రత్యర్థులు ప్రభుత్వాన్ని డ్యామేజ్ చేస్తుంటే? చూస్తూ ఊరుకోవడం కూడా కరెక్ట్‌కాదు కదా అన్న మాటలు వినిపిస్తున్నాయి కూటమి నాయకుల నుంచి. తాజాగా భూమన ఓ విగ్రహ వివాదాన్ని తెరపైకి తెచ్చి సనాతన ధర్మ యోధుడు పవన్ కళ్యాణ్ ఎక్కడ అంటూ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు? అదే స్థాయిలో ప్రభుత్వాన్ని, సీఎం చంద్రబాబును టార్గెట్ చేశారాయన. అది రాష్ట్ర వ్యాప్తంగా హాట్ టాపిక్..ప్రతిపక్షం తప్పుడు ప్రచారం చేస్తోందనిఖండించాల్సిన ఎమ్మెల్యే.. ఆ బాధ్యత ఎందుకు తీసుకోలేదని ప్రశ్నిస్తున్నారట జనసైనికులు. స్థానిక టిడిపి నేతలు కొందరు భూమన తీరును ఖండించారు తప్ప ఎమ్మెల్యే మాత్రం? నాకేం తెలియదు అన్నట్టు ఉండటంపై జనసేన పెద్దలు కూడా అసహనంగా ఉన్నట్టు తెలుస్తోంది. రాయలసీమలో గెలిచిన ఏకైక బలిజ సామాజి వర్గానికి చెందిన ఎమ్మెల్యే ఆరణి. ఆయన రికార్డ్ మెజార్టీతో గెలిచినప్పుడు వినిపించిన సౌండ్ ఇప్పుడేమైందంటూ? సెటైర్స్ వేస్తున్నారు కూటమి నాయకులు. తాను తిరుమలకు కూడా ఎమ్మెల్యేని అన్న సంగతిని ఆయన మర్చిపోయారా? లేక వైసీపీలో ఉన్నప్పటి పాత పరిచయాలు గుర్తుకువచ్చి ఇప్పుడు నోరు పెగలడం లేదా అంటూ ఘాటుగా రియాక్ట్ అవుతున్నారు తిరుపతి జనసైనికులు. ఇదే సమయంలో మరో వాదనా వినిపిస్తోంది. మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి పనీపాటా లేకుండా రోజుకొక ప్రెస్ మీట్ పెట్టి తిరుమల కొండ లక్ష్యంగా ఏదో ఒక అసత్య ప్రచారం చేస్తుంటారని, ఆయన చేసే టైంపాస్ పాలిటిక్స్‌కు ప్రతిరోజు నేను రియాక్ట్ అవ్వాల్సిన అవసరం లేదన్న అభిప్రాయంతో ఆరణి ఉన్నారంటూ వెనకేసుకొస్తున్నారు ఆయన సన్నిహితులు. కానీ? ప్రతిదానికీ రియాక్ట్ అవకున్నా? తీవ్ర స్థాయి ఆరోపణలు వచ్చి, పార్టీకి, ప్రభుత్వానికి పెద్ద డ్యామేజ్ జరుగుతున్నప్పుడు, మత పరంగా సున్నితమైన వ్యవహారాల్లో కూడా జోక్యం చేసుకోకుంటే? ఇక ఎమ్మెల్యే ఉండి కూడా ఏం లాభం అన్నది తిరుపతి కూటమి నేతల క్వశ్చన్.

# వసతిగృహాల సరుకుల

## సరఫరాదారులకు బిల్లులు చెల్లించాలి



**పెద్దపల్లి,తెలంగాణ దిశ:** రాష్ట్రంలోని సంక్షేమ వసతి గృహాల్లో క్యాటరింగ్,నాన్ వెజ్, కూరగాయల సరఫరాదారులకు 5 నెలలుగా పెండింగ్ లో ఉన్న బకాయిలు తక్షణమే చెల్లించాలని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ జిల్లా మాజీ కమిటీ సభ్యుడు, నాన్ వెజ్ సరఫరాదారుడు కొంకటి లింగమూర్తి డిమాండ్ చేశారు.

పెద్దపల్లి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వసతి గృహాల్లో సామాన్లు సరఫరా చేయడానికి కొందరు కాంట్రాక్టర్లు అప్పులు తెచ్చి భార్యా పిల్లలపై ఉన్న బంగారాన్ని కుదువబెట్టి పిల్లల కడుపు నింపుతున్నా రని వాపోయారు. సరుకులు సరఫరా చేయడానికి బిల్లులు రాక చేసిన అప్పులు తీర్చలేక నానా ఇబ్బందులు పడుతు న్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

రాష్ట్ర ప్రభుత్వంలోని అనేక మంది మంత్రులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని అన్నారు. సరఫరా చేసే కాంట్రాక్టర్ల కుటుంబాలు పస్తులుండే పరిస్థితి నుండి ప్రభుత్వం కాపాడాలని కోరారు. తక్షణమే పెండింగ్ బిల్లులు ఇవ్వకపోతే సరుకుల సరఫరా నిలిపివేస్తామని ప్రకటించారు.

# సినిమా..

## దేవర వార్షికోత్సవం.. ఫ్యాన్స్ కోసం స్పెషల్ షో..!

జూనియర్ ఎన్టీఆర్ కథానాయకుడిగా నటించిన దేవర చిత్రం ఏడాది పూర్తి చేసుకున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఎన్టీఆర్ చిత్రబృందానికి వార్షికోత్సవం శుభాకాంక్షలు తెలుపుతున్నారు. మరోవైపు చిత్రబృందం కూడా దేవర వన్ ఇయర్ పూర్తి చేసుకున్న సందర్భంగా దేవర 2 త్వరలోనే సెట్స్ మీదకి వెళ్లబోతున్నట్లు ప్రకటించింది. అయితే ఈ సినిమా ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా అభిమానుల కోసం చిత్రబృందం స్పెషల్ షోని ఏర్పాటు చేసింది. కూకట్‌పల్లిలోని అర్జున్ థియేటర్‌లో రాత్రి 9 గంటలకు దేవర సినిమాను ప్రదర్శించ బోతున్నట్లు ప్రకటించింది. ఈ సందర్భంగా పోస్టర్‌ను పంచుకుంది. ఈ సినిమాకు కొరటాల శివ దర్శకత్వం వహించగా.. జాన్వీ కపూర్ కథానాయికగా నటించింది. సైఫ్ అలీఖాన్ విలన్‌గా నటించాడు. ఈ చిత్రం సెప్టెంబర్ 27న విడుదలై దాదాపు రూ.500 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది.



## వెంకీ సినిమా కోసం త్రివిక్రమ్ కొత్త టీమ్

'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రంతో బ్లాక్ బస్టర్ అందుకున్న నటుడు విక్టరీ వెంకటేశ్ ప్రస్తుతం త్రివిక్రమ్ శ్రీనివాస్‌తో సినిమా చేయబోతున్న విషయం తెలిసిందే. ఇటీవలే ఈ సినిమా పూజ కార్యక్రామాలు పూర్తి చేసుకున్న చిత్రయూనిట్ అక్టోబర్‌లో రెగ్యూలర్ షూటింగ్ ప్రారంభించనుంది. ఈ చిత్రాన్ని హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్.రాధాకృష్ణ నిర్మించనున్నట్లు తెలుస్తోంది. వెంకీ 77 అనే వర్కింగ్ -టైటిల్‌తో ఈ ప్రాజెక్ట్ రాబోతుంది. అయితే ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి తాజాగా ఒక విషయం వైరల్‌గా మారింది. ఈ సినిమా కోసం త్రివిక్రమ్ తన టీమ్ మొత్తాన్ని మార్చినట్లు- తెలుస్తుంది. కొత్తవారిని ఈ సినిమా కోసం తీసుకున్నట్లు- ఫిల్మ్ నగర్‌లో టాక్ నడుస్తుంది. అయితే ఇది ఎంత వరకు నిజం అనేది తెలియాల్సి ఉంది. వెంకటేశ్ నటించిన నువ్వు నాకు నచ్చావ్, మల్లీశ్వరి చిత్రాలకు త్రివిక్రమ్ మాటలు రాశారు. దర్శ




కుడయ్యాక ఆయన వెంకీతో సినిమా చేస్తారని అందరూ భావించారు. కానీ ఎందుకో ఆ కాంబినేషన్ సెట్ కాలేదు. అయితే.. ఎట్టకేలకు వెంకీ, త్రివిక్రమ్‌ల కాంబినేషన్ సెట్ అవ్వడంతో అభిమానులు ఈ సినిమా కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నారు.

## నవీన్ పోలిశెట్టి.. అనగనగా ఒకరాజు



నవీన్ పోలిశెట్టి, మీనాక్షి చౌదరి ప్రధాన పాత్రల్లో దర్శకుడు మారి తెరకెక్కిస్తున్న చిత్రం 'అనగనగా ఒకరాజు'ఈ కామెడీ ఎంటర్‌టైనర్ మూవీసంక్రాంతి కానుకగా 2026 జనవరి 14న విడుదల కానుంది. తాజాగా ఓ స్పెషల్ ప్రోమోను టీ-మ్ షేర్ చేసింది. నటీ-నటులిద్దరూ జ్యువెలరీ యాడ్‌లో నటిస్తున్నట్లు-గా రిలీజ్ డేట్‌ను ప్రకటించారు. దీన్ని 'సంక్రాంతి ప్రోమో' పేరుతో టీ-మ్ షేర్ చేసింది. తనదైన కామెడీ -టైమింగ్ తో ప్రేక్షకుల హృదయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న నవీన్ పోలిశెట్టి, మరో ఫ్యామిలీ చిత్రం 'అనగనగా ఒక రాజు'తో అలరించడానికి సిద్ధమవుతున్నారు. తాజాగా ఈ చిత్రం నుంచి విడుదలైన టీజర్, ఈ సంక్రాంతికి ప్రేక్షకులను నవ్వుల కనుక అందివ్వబోతున్నట్టు అర్థం అవుతోంది. బంగారు ఆభరణాల ప్రకటనపై స్పూఫ్ తో ప్రారంభమైన ఈ టీ-జర్, ఎంతో వైవిధ్యంగా ఉంది. ఒంటి నిండా ఆభరణాలు ధరించిన మీనాక్షి చౌదరి, తమ సినిమా గురించి కాకుండా ఆభరణాల గురించి మాట్లాడుతుండటంతో ఆమె ఆభరణాలను నవీన్ పొలిశెట్టి ధరించి కనిపించడం భలే సరదాగా ఉంది. టీజర్ లో నవీన్ పొలిశెట్టి, మీనాక్షి చౌదరి పోటాపోటీగా నవ్వులు పంచారు. వినోదాల వేడుకకు వేదికగా ఈ టీజర్ నిలిచింది. ఇప్పటికే విడుదైన పోస్టర్లు, గ్లింప్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టు-కున్నాయి. తాజా టీజర్ అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తూ.. సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. నవీన్ యొక్క అద్భుతమైన కామెడీ -టైమింగ్ ప్రతి ఫ్రేమ్ లో ప్రకాశించింది. తెరపై నవీన్ ఉత్సాహంగా కనిపించిన తీరు సంక్రాంతి పండుగకు ప్రేక్షకులు కోరుకునే అసలైన వినోదాల విందుకి వాగ్దానంలా ఈ టీ-జర్ నిలిచింది. కేవలం ఒక నిమిషం కంటే ఎక్కువ నిడివితో రూపొందిన ఈ టీజర్, సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది. అంతేకాకుండా హాస్యం, తాజాదనం మరియు కమర్షియల్ పంచ్‌లను మిళితం చేసే చిత్రాలను ఎంచుకోవడంలో నవీన్ పొలిశెట్టి నైపుణ్యాన్ని పునరుద్ఘాటించింది. టీ-జర్ చూసిన ప్రతి ఒక్కరూ నవీన్ ఖాతాలో మరో ఘన విజయం ఖాయమని ప్రశంసలు కురిపిస్తున్నారు. సంక్రాంతి కానుకగా 2026 జనవరి 14న విడుదల కానున్న 'అనగనగ ఒక రాజు'పై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి.


## కొత్త రూల్.. ఎలక్ట్రిక్ వాహనాలకు సౌండ్ తప్పనిసరి!



రోడ్డు భద్రతను దృష్టిలో ఉంచుకుని.. 2027 అక్టోబర్ 1 నుంచి అన్ని ఎలక్ట్రిక్ కార్లు, బస్సులు, ట్రక్కులకు అకౌస్టిక్ వెహికల్ అలర్ట్ సిస్టమ్ ను తప్పనిసరి చేయాలని రోడ్డు రవాణా రహదారుల మంత్రిత్వ శాఖ ప్రతిపాదించింది. అక్టోబర్ 2026 తర్వాత.. తయారయ్యే అన్ని కొత్త ఎలక్ట్రిక్ వాహనాలు తప్పనిసరిగా ఈవీఏఎస్ కలిగి ఉండాలని మంత్రిత్వ శాఖ ఒక ముసాయిదా నోటిఫికేషన్‌లో పేర్కొంది. ఈ సిస్టం వల్ల ఎలక్ట్రిక్ కారు కూడా సౌండ్ చేస్తుంది. ఈ సౌండ్ వల్ల కారును ఎవరైనా సులభంగా గుర్తించవచ్చు. అమెరికా, జపాన్, కొన్ని యూరోపియన్ యూనియన్ దేశాలు ఇప్పటికే హైబ్రిడ్ వాహనాలలో వాడకాన్ని తప్పనిసరి చేశాయి. ఇది రోడ్డు ప్రమాదాలను తగ్గించడంలో సహాయపడుతోంది. దీనిని దృష్టిలో ఉంచుకుని రోడ్డు రవాణా రహదారుల మంత్రిత్వ శాఖ ఇండియాలో కూడా ఈ విధానం అమలు చేయాలని సంకల్పించింది. నిజానికి ఎలక్ట్రిక్ కార్లు.. ఫ్యూయెల్ కార్ల మాదిరిగా సౌండ్ చేయవు. దీనివల్ల ముందు వెళ్తున్న కారుకు లేదా వ్యక్తులకు వెనుక ఒక కారు వస్తుందనే విషయం తెలియకుండా పోతుంది. ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. దీనిని దృష్టిలో ఉంచుకునే ఎలక్ట్రిక్ కార్లలో అకౌస్టిక్ వెహికల్ అలర్ట్ సిస్టమ్ ఉండాలని మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది.

## చాట్‌జీపీటీతో కొత్త భాష.. కేవలం 30 రోజుల్లో!

ఏ ప్రశ్నకైనా సమాధానం ఇచ్చే చాట్‌జీపీటీ ఇప్పుడు కొత్త భాషలు నేర్చుకోవడానికి కూడా సహకరిస్తోంది. నెల రోజుల వ్యవధిలోనే.. పదజాలం, వ్యాకరణం, మాట్లాడటం వంటివి సులభంగా నేర్చుకోవచ్చు!. దీనికి సంబంధించిన ఒక ట్వీట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సులభంగా కొత్త భాషను 30 రోజుల్లో నేర్చుకోవడానికి 8 ప్రాంప్ట్‌లను ఉపయోగించాల్సి ఉంటుందని మార్కెటింగ్, గ్రోత్ నిపుణుడైన 'చిదానంద్ త్రిపాఠి' పేర్కొన్నారు. అవి "30 రోజులలో భాషా అభ్యాస ప్రణాళిక, రోజువారీ పదజాలం, అభ్యాస అనుకరణ, సాధారణ పదాలలో వ్యాకరణ వివరణ, వినడం, నిజ జీవిత సంభాషణకు సంబంధించిన ఉదాహరణలను క్రియేట్ చేయడం, తప్పుల దిద్దుబాటు, మోటివేషనల్ చెక్". పైన ద్వారా.. నెల రోజుల్లో కొత్త భాషను సులభంగా నేర్చుకోవచ్చని.. చిదానంద్ త్రిపాఠి పేర్కొన్నారు. ప్రాక్టీస్ చేయుడానికి, పదాలను తెలుసుకోవడానికి చాట్‌జీపీటీ ఉపయోగపడుతుందని ఆయన వివరించారు.




## అప్రమత్తంగా వ్యవహరించిన మదుపరులు..

బెంచ్‌మార్క్ సూచీలు స్వల్ప నష్టాల్లో ముగిశాయి. ఈ వారం చివరలో ఆర్‌బీఐ మనీమానిటరీ పాలసీ కమిటీ నిర్ణయాలను ప్రకటించనున్నది. అయితే, వడ్డీ రేట్లపై కీలక ప్రకటన చేసే అవకాశం ఉంది. అయితే, దీనికి ముందు విదేశీ పెట్టుబడిదారులు తమ పెట్టుబడులను ఉపసంహరించుకుంటున్నారు. ఈ క్రమంలో మార్కెట్లు స్వల్పంగా అస్థిరతకు గురయ్యారు. యూఎస్ డాలర్‌తో పోలిస్తే రూపాయి ఏడు పైసలు తగ్గి ఆల్‌టైమ్ కనిష్ట స్థాయి 88.79 వద్ద ముగిసింది. ఈ క్రమంలో సెన్సెక్స్ 60 పాయింట్లకుపైగా పతనమైంది. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ ఉదయం 80,588.77 లాభాల్లో మొదలైంది. మధ్యాహ్నం ఒక్కసారిగా మార్కెట్లు నష్టాల్లోకి జారుకున్నాయి. చివరి సెషన్‌లో మార్కెట్లు కోలుకోవడంతో నష్టాలు తగ్గాయి. ఇంట్రాడేలో 80,851.38 పాయింట్ల గరిష్టాన్ని తాకిన సెన్సెక్స్.. అత్యల్పంగా 80,248.84 పాయింట్ల కనిష్టానికి చేరింది. చివరకు 61.52 పాయింట్ల నష్టంతో 80,364.94 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 19.80 పాయింట్లు తగ్గి 24,634.90 వద్దకు ముగిసింది. విదేశీ పెట్టుబడిదారుల అమ్మకాల కారణంగా నిఫ్టీ వరుసగా ఏడు ట్రేడింగ్ సెషన్లలో 3శాతానికి పైగా పడిపోయింది. సెన్సెక్స్‌లో మారుతి, యాక్సిస్ బ్యాంక్, ఎల్‌ఎఅండ్‌టీ, ఐసీఐసీఐ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, ఇన్ఫోసిస్, అదానీ పోర్ట్స్, హిందూస్తాన్ యూనిలీవర్ నష్టపోయాయి. టైటాన్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎటర్నల్, ట్రెంట్ లాభాలను ఆర్జించాయి. ఆయిల్ అండ్ గ్యాస్, పీఎస్‌యూ బ్యాంక్, ఎనర్జీ, రియాలిటీ రంగాల్లో ఒక్కొక్కటి ఒకశాతం పెరిగాయి, మీడియా ఇండెక్స్



దాదాపు ఒకశాతం తగ్గింది. జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ లిమిటెడ్ పరిశోధనా విభాగాధిపతి వినోద్ నాయర్ మాట్లాడుతూ.. దేశీయ మార్కెట్ ఎలాంటి స్థిరత్వం లేకుండా అస్థిరంగా ముగిసిందని పేర్కొన్నారు. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు పెట్టుబడులు ఉపసంహరించుకోవడడంతో పెట్టుబడిదారులు జాగ్రత్తపడుతున్నారని పేర్కొన్నారు. యూఎస్–భారత్‌పై వాణిజ్య ఒప్పందంపై స్పష్టత లేకపోవడం, ఐటీ, ఫార్మా ఇండెక్స్‌పై దీర్ఘకాలిక ఒత్తిడి ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. ఇదిలా ఉండగా.. ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా కోస్పి, షాంఘై ఎస్ఎస్ఈ కాంపోజిట్ ఇండెక్స్, హాంకాంగ్ హాంగ్ సెంగ్ సానుకూలంగా ముగిశాయి. జపాన్ నిక్కీ 225 ఇండెక్స్ పతనమైంది. గ్లోబల్ ఆయిల్ బెంచ్‌మార్క్ బ్రెంట్ ముడి చమురు బ్యారెల్‌కు 1.25 శాతం తగ్గి 69.25 డాలర్లకు చేరుకుంది.

## మాంద్యం ఎఫెక్ట్.. భారీగా లేఆఫ్స్ ప్రకటించిన ప్రముఖ విమానయాన సంస్థ..



ప్రపంచ వ్యాప్తంగా లేఆఫ్స్ పర్వం కొనసాగుతోంది. ఇప్పటికే ప్రముఖ ఐటీ సంస్థలు వేల సంఖ్యలో ఉద్యోగులను తొలగించాయి. తాజాగా జర్మనీకి చెందిన ప్రముఖ విమానయాన సంస్థ లుఫ్తాన్స (%ాబట్ష్టుఅయి%) ఎయిర్‌లైన్స్ కూడా కీలక నిర్ణయం తీసుకుంది. రానున్న ఐదేండ్లలో వేల సంఖ్యలో ఉద్యోగులను తొలగించనుంది. 2023 నాటికి 4,000 ఉద్యోగాలను తగ్గించనున్నట్లు సంస్థ తాజాగా ప్రకటించింది. ఖర్చులను తగ్గించి కొత్త సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. తన కార్యకలాపాల విస్తృత సమీక్షలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు లుఫ్తాన్స తన ప్రకటనలో తెలిపింది. అంతేకాదు సంస్థ పునర్నిర్మాణంతోపాటూ 2028 నుంచి 30 వరకు కొత్త ఆర్థిక లక్ష్యాలను కూడా నిర్దేశించుకుంది. ఈ కాలంలో 8 శాతం నుంచి 10 శాతం వరకూ ఆపరేటింగ్ మార్జిన్‌ను సాధించాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. కాగా సంస్థ నిర్ణయంతో ఈ లేఆఫ్స్ ప్రధానంగా అడ్మినిస్ట్రేటివ్ రోల్స్‌పై ప్రభావం చూపనున్నట్లు తెలుస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా ఈ సంస్థలో దాదాపు 103,000 మంది ఉన్నారు. జర్మనీ వరుసగా రెండో ఏడాది కూడా తీవ్ర ఆర్థిక మాంద్యంఎదుర్కొంటున్నట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. నిరుద్యోగం పదేళ్లలో అత్యధిక స్థాయికి చేరుకుంది. దేశంలోని పెద్ద కంపెనీలు.. పెరుగుతున్న ఇంధన ఖర్చులు, చైనా నుంచి పోటీ, కొత్త సాంకేతిక పరిజ్ఞానాలను స్వీకరించడంలో పురోగతి లేకపోవడం వంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు సదరు నివేదికలు పేర్కొంటున్నాయి. ఈ క్రమంలోనే జర్మనీలోని పలు సంస్థలు ఉద్యోగులకు లేఆఫ్స్ ప్రకటిస్తున్నాయి. కొన్ని రోజుల క్రితం బోష్ సంస్థ ప్రపంచవ్యాప్తంగా 13,000 ఉద్యోగాలను తగ్గిస్తామని ప్రకటించింది. అంటే మొత్తం ఉద్యోగుల్లో 3 శాతం అన్న మాట.


## ఐఎన్ఎస్‌సీఓ చేతికి హెచ్ఎన్‌జీఐఎల్



న్యూఢిల్లీ: రుణ ఊబిలో చిక్కుకున్న హిందుస్తాన్ నేషనల్ గ్లాస్ అండ్ ఇండస్ట్రీస్ సంస్థను దివాలా పరిష్కార ప్రక్రియ ద్వారా చేజిక్కించుకున్నట్లు ఉగాండాకు.. చెందిన మధ్వాని గ్రూప్ కంపెనీ ఇండిపెండెంట్ షుగర్ కార్పొరేషన్ లిమిటెడ్ తెలిపింది. కొత్తగా ఏర్పడిన హెచ్ఎన్‌జీఐఎల్ బోర్డు ఈ విషయాన్ని అధికారికంగా ధృవీకరించింది. ఈ కొనుగోలు ప్రక్రియ పారిశ్రామికవేత్తలు కమ్లేష్ మాధ్వాని, శ్రై మాధ్వాని నేతృత్వంలో జరిగింది. సెర్బరస్ క్యాపిటల్ మేనేజ్‌మెంట్, ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ నుండి ఆర్థిక మద్దతు లభించిందని ఐఎన్ఎస్‌సీఓ ప్రకటన ద్వారా తెలిపింది. దాదాపు రూ. 2,250 కోట్ల ఈ రిజల్యూషన్ ప్రణాళికకు ఆగస్టు 14న ఎన్‌సీఎల్‌టీ ఆమోదం తెలిపింది. తదుపరి ఆర్‌బీఐ, సీసీఐ నుంచి అనుమతులు లభించాయి. మొత్తం 45 రోజుల్లో విలీన ప్రక్రియ పూర్తి అయినట్లు ఐఎన్ఎస్‌సీఓ పేర్కొంది.

## పేటీఎం నయా స్కీమ్ మామూలుగా లేదు.. మీకు గోల్డ్ కాయిన్స్ వచ్చాయా?

సహజంగా పండుగల సమయంలో కంపెనీలు వినియోగదారులను టార్గెట్ చేస్తుంటాయి. కొత్తకొత్త ఆఫర్లు తీసుకొస్తూ వారిని ఆకర్షించడానికి అనేక స్కీమ్స్‌ను ప్రకటిస్తుంటాయి. అందులో భాగంగానే డిజిటల్ పేమెంట్స్ యాప్ పేటీఎం కూడా ఒక సూపర్ ఆఫర్ ప్రకటించింది. మీకు తెలుసా ఆ స్కీమ్ ఏంటో. మీకు ఇప్పటి వరకు ఏమైనా గోల్డ్ కాయిన్స్ వచ్చాయా.. ఏంటి ఈ గోల్డ్ కాయిన్స్ అనుకుంటున్నారా.. ఈ స్కీమ్‌కు ఈ కాయిన్స్‌కు సంబంధం ఉంది..ఈ కొత్త ఆఫర్ కథ ఏంటో ఈ స్టోరీలో తెలుసుకుందాం.. పండుగ పూజ డిజిటల్ పేమెంట్స్ యాప్ పేటీఎం గోల్డ్ రివార్డ్స్ స్కీమ్ పేరుతో సూపర్ ఆఫర్‌ను తీసుకొచ్చింది. పేటీఎం నుంచి డిజిటల్ పేమెంట్స్, కార్డు పేమెంట్స్ మొదలైన ఎలాంటి ట్రాన్సాక్షన్ చేసినావారికి గోల్డ్ కాయిన్ రివార్డ్స్ పొందేలా ఓ కొత్త ఆఫర్‌ను అందుబాటులోకి తెచ్చింది. పేటీఎం ద్వారా చేసే ప్రతీ ఆన్ లైన్ ట్రాన్సాక్షన్ పై డిజిటల్ గోల్డ్ కాయిన్స్ రివార్డ్స్ వస్తున్నాయి. వీటిని తర్వాత బంగారంపై పెట్టుబడిగా మార్చుకోవచ్చని కంపెనీ తెలిపింది. ఇప్పటి వరకు రివార్డ్స్ అనేవి ఎవరైనా సరే క్యాష్‌బ్యాక్ లేదా కూపన్స్ రూపంలో ఇచ్చారు. కానీ వాటికి భిన్నంగా పేటీఎం గోల్డ్ కాయిన్ రివార్డ్స్‌ను ప్రవేశపెట్టింది.




Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. rni. no: TELTEL/2023/88215